


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 30-10-2019 VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 44 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## చీఫ్ జస్టిస్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర

ఢిల్లీ : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే నియామకంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఆమోద ముద్ర వేశారు.

నవంబర్ 18న ఆయన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతమున్న చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నవంబర్ 17వ తేదీన పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. ఆ లోపే వివాదాస్పద అయోధ్య కేసులో తుది తీర్పు ఇస్తానని రంజన్ గొగోయ్ ఇంతకుముందే ప్రకటించారు.

## ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి మానవతా దృక్పథంతో..



ఉన్నత స్థానాల్లో ఉన్నవారు గంభీరంగా వ్యవహరిస్తూ ఉంటారు. అయితే రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ, నరేంద్ర మోదీ వంటివారు కొన్ని సందర్భాల్లో అప్పటికప్పుడు మానవతా దృక్పథంతో తమ ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి వ్యవహరించినట్లు వార్తల్లో చూస్తూ ఉంటాం. మంగళవారం కూడా అటువంటి సన్నివేశం ఒకటి జరిగింది.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, సహాయ ఆర్థిక మంత్రి అనురాగ్ ఠాకూర్ పాల్గొన్న కార్యక్రమంలో ఈ సంఘటన జరిగింది. మొదటి జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత పురస్కారాల ప్రదాన కార్యక్రమం విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగింది. వేదికకు ముందు ఢిల్లీ పోలీసు మహిళా అధికారి ఒకరు నిల్చున్నారు. జాతీయ గీతం ఆలపించే సమయంలో ఆమె కాలి మడమ మెలిపడటంతో కుప్పకూలిపోయారు. జాతీయ గీతాలాపన పూర్తి కాగానే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అక్కడే ఉన్న సహాయ ఆర్థిక మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో మాట్లాడి, వేదిక నుంచి దిగి, కుప్పకూలిన మహిళా పోలీసు అధికారి వద్దకు వెళ్ళి, పరామర్శించారు. ఆ సమయంలో నిర్మల సీతారామన్ కూడా వీరితో ఉన్నారు. అనురాగ్ ఠాకూర్ ఆమెకు మంచినీటి సీసా అందించారు. ఆమె ఆరోగ్యం సక్రమంగానే ఉన్నట్లు నిర్ధారించుకుని వీరంతా అక్కడి నుంచి వెళ్ళిపోయారు. సాధారణంగా రాష్ట్రపతి జాతీయ గీతాలాపన తర్వాత వేదిక నుంచి నిష్క్రమిస్తారు. కానీ కోవింద్ ప్రమాదవశాత్తూ కింద పడిన పోలీసు అధికారిణిని పరామర్శించడాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

## వైద్య రంగంలో సంస్కరణలకు శ్రీకారం



తాడేపల్లి : ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పందన (ప్రజా పరిష్కార వేదిక) కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

### బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను స్వయం ప్రతిపత్తి సంస్థలు!

### ముఖ్యమంత్రి జగన్ కీలక ఆదేశాలు

### జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్

కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో రాష్ట్ర వైద్య రంగంలో సంస్కరణలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీచేశారు. వైద్య తరువాయి 2లో..

## మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

- పార్లమెంటు పనితీరులో భారీ సంస్కరణలు అవసరం
- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపు



న్యూఢిల్లీ : చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. పార్లమెంటు పనితీరులో భారీ సంస్కరణలు అవసరమని చెప్పారు. ఎంపీలకు ప్రవర్తన నియమావళి ఉండాలని, సభ కార్యక్రమాలకు అంతరాయం కలిగించే సభ్యులపై సభాపతి తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండాలని అన్నారు. ఆయన మంగళవారం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అరుణ్ జైట్లీ స్మారకోపన్యాసమిచ్చారు. పార్లమెంటులో ప్రస్తుతం 13 శాతం మంది తరువాయి 2లో..

## ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80 శాతం అమలు

- రాబోయే 5 యేళ్లలో 25 లక్షల గృహాలు
- భీమి నియోజక వర్గంలో రూ.73.46 కోట్లు
- మహిళా సంఘాలకు ఋణాలు పంపిణీ
- ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి



భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సుమారుగా 80 శాతం వరకు అమలు చేసినట్లు రాజ్య సభ్యులు విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భీమునిపట్నం శాసన సభ నియోజక వర్గం భీమిలి మండలం చిట్టివలసలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలకు ఋణాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఏర్పాటు చేసిన మొట్టమొదటి శాసన సభ సమావేశంలో సుమారుగా 20 బిల్లులను చట్టసభలో ప్రవేశపెట్టి వాటిని చట్టాలుగా చేయడమైనదని, ఇందులో ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలకు సంబంధించినవి ఉన్నాయని, ఇందులో నామినేటెట్ పోస్టులు, తరువాయి 2లో..

## సైన్సే మానవాళి అభివృద్ధికి మూలకారణం

- ఎన్ని సార్లు విఫలమైనా విజయం సాధించేవరకు విడిచిపెట్టొద్దు
- విద్యకు, వైద్యానికి వైకాపా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- మూడు రోజుల పాటు గిరిజన గురుకుల రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- ప్రతిభగల విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ
- డిప్యూటి ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి



విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని డిప్యూటి ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తరువాయి 6లో..

## మహిళలకు అవగాహన పెరగాలి



విజయవాడ : సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు పోలీసుల సహకారం ఉంటుందని డీజీపీ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం సిద్దార్ధ కళాశాల నుంచి నిర్వహించిన 3కె. వాక్‌ను ఆయన తరువాయి 2లో..




## బోరు బావిలో పడిన చిన్నారి సుజిత్ కథ విషాదాంతం

తిరుచ్చి : నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రయత్నాలు ఫలించలేదు. చిన్నారి సుజిత్ విల్సన్ చనిపోయినట్లు ప్రకటించిన అధికారులు. బోరు బావిలో నుంచి కుళ్లిన స్థితిలో ఉన్న సుజిత్ డెడ్‌బాడీని బయటకు తీసిన అధికారులు.

తమిళనాడులో ప్రమాదవశాత్తూ బోరు బావిలో పడిపోయిన చిన్నారి సుజిత్ కన్నుమూశాడు. అధికారులు నాలుగు రోజులుగా చేసిన ప్రయత్నాలు బాలుడ్ని సురక్షితంగా బయటకు తీయలేకపోయారు. చిన్నారి చనిపోయినట్లు డాక్టర్లు సోమవారం నిర్ధారించగా.. అర్థరాత్రి తర్వాత బోరు బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. సుజిత్ ఇంక తిరిగి రాడనే విషయాన్ని తలచుకొని తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

తమిళనాడులోని తిరుచ్చిలో రెండేళ్ల బాలుడు సుజిత్ విల్సన్.. ఈ నెల 25న బోరుబావిలో పడ్డాడు. చిన్నారి ముందు 35 అడుగుల్లో చిక్కుకుపోయాడు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు.. రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టారు. పసివాడిని కాపాడేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సహాయక చర్యలు కొనసాగుతున్న సమయంలో.. బాలుడు దురదృష్టవశాత్తూ జారిపోయి 90 అడుగుల లోతులో పడిపోయాడు. దీంతో బయటకు తీయడం కష్టతరంగా మారింది. బాలుడ్ని వెలికి తీసేందుకు భారీ యంత్రాలను రంగంలోకి దించారు. నాలుగు రోజులుగా ప్రయత్నాలను కొనసాగించారు.

ప్రధాని నరేంద్ర మోదీ కూడా బాలుడి క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. సహాయక



చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటు సుజిత్ క్షేమంగా బయటకు రావాలని తమిళనాడుతో పాటూ యావత్ దేశం ఆకాంక్షించింది. సోమవారం రాత్రి సమయంలో చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తరువాయి 2లో..

# నేటి నుంచి అందుబాటులోకి ఇసుక

**- అనకాపల్లి ఆర్‌డిఓ జె.సీతారామారావు**



దేవరాపల్లి : నేటి నుంచి ప్రజలకు ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి ఆర్ డి ఓ జె.సీతారామారావు తెలిపారు. మండలంలోని తెనుగుపూడి, కలిగొట్ల, తిమిరాం, తామరబ్బా గ్రామాలలో ఇసుక రీచ్ లను గుర్తించేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను గుర్తించాలని ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి అన్నారు. ప్రస్తుతం ఎంత ఇసుక అందుబాటులో ఉన్నది అన్న విషయాన్ని గుర్తిస్తున్న మన్నారు. పంచాయతీ కార్యదర్శి స్టాండ్ ఆఫీసర్ గా వ్యవహరించగా గ్రామ వాలంటీర్లు పర్యవేక్షణలో ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. ఇసుక తవ్వకాల్లో ఎటువంటి యంత్రాలను ఉపయోగించి తీసుకు వెళ్ళ కూడదని తెలిపారు. అందువలన ఎవరు ఎక్కడ ఎటు వంటి యంత్రాలను ఉపయోగించి ఇసుక తవ్వకాలు జరగకూడదని సూచించారు. టన్ను ఇసుక ధర మూడు వందల డబ్బై ఐదు రూపాయలు అందిస్తున్నామన్నారు. ఆఫ్ లైన్ ద్వారా పంచాయతీ కార్యదర్శికి సొమ్ము చెల్లించి 48 గంటల లోపు ఇసుక తరలింపు కోవాలని తెలిపారు. ఒక వ్యక్తికి కేవలం పది టన్నుల ఇసుక కొనుగోలు చేసుకునే అవకాశం కలదు, మండల పరిధిలోని మాత్రమే ఇసుక రవాణా జరపాలని మండలం దాటితే చర్యలు తప్పవన్నారు. వాల్టా చట్టానికి లోబడి మూడు మీటర్ల నుంచి ఎనిమిది మీటర్ల లోతు గల ఇసుక రీచ్ లను గుర్తించి వాటి ద్వారానే ఇసుక పంపిణీ చేయడం జరుగుతుందని అలాగే నదీ పరివాహక ప్రాంతాల్లో వంతెన లు ఉన్న చోట ఇసుక తవ్వకాలు జరపరాదని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 2 లక్షల 11 వేల పాసుపుస్తకాల కలిగి ఉన్నాయని అందులో ఒక లక్షా 60 వేల పట్టాదారు పాసు పుస్తకాలు అప్లోడ్ అయ్యాయన్నారు. ప్రజా సాధికార సర్వే లో 6500 పట్టాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిలో 3000 వరకు తగ్గించుకోవడానికి పని జరిగిందన్నారు. రైతు భరోసా కోసం బ్యాంకు లింకు లేని ఆధార్ కలిగిన రైతులకు తమ బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ చేయడం జరుగుతుందన్నారు.

ఆయన వెంట తహశీల్దార్ జె. రమేష్ బాబు, తోపాటు మైనింగ్, గ్రౌండ్ వాటర్ శాఖ అధికారులు ఉన్నారు.

## పంచాయతీ కేంద్రంలో వాలంటీర్లతో ప్రత్యేక సమావేశం



అనంతగిరి : మండలంలో రైతు భరోసా అమలుకు ప్రత్యక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఓ ఏవివి కుమార్ అన్నారు. మండలం లోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో వాలంటీర్లతో ప్రత్యేక సమావేశం అయ్యారు. చిలకలాగెడ్డ, కసిపట్నం, భీంపోలు, పంచాయితీల వాలంటీర్లకు ఆయన సూచనలు ఇచ్చారు.

చాలా మంది రైతులు అర్హత వున్నా ఈ పథకం వారికి అందక పోతే వెంటనే వారిని గుర్తించి వారికి పథకం వర్తించేలా చొరవ తీసుకోవాలని తెలిపారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూర్తి బాధ్యతలు స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఎన్‌వీఎస్ మూర్తి (బాలు) బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించిన మూర్తిని పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం (మణి), న్యాయవాదులు సాదే నరసింహారావు, కె.వి.రాయుడు, సిహెచ్.కనక దుర్గారావు, గన్నంరాజు సత్యనారాయణ, కె.వి.చలం, జివిఎస్.నారాయణ, పిట్టా సుగుణారావు, ఎం.మొహిద్దీన్, దారా శ్రీనివాస్, బివిఎస్.లక్ష్మణరావు, చావలి కృష్ణారావు, డికె.జైన్, అళక్కి కృష్ణ, కె.కమలాకర్, షేక్ వల్లిబాబు, మడికి రాంబాబు, తటపర్తి సత్యనారాయణ, ఎన్.కాశీ సోమేశ్వరరావు, వేమన అశోక్‌కుమార్, సిహెచ్.శివరామకృష్ణ, బొండాడ శరన్న, డివిఎస్.రవికుమార్, డివిఎస్. ప్రకాష్, సకురు దుర్గారావు తదితరులు అభినందించారు.

## సోమునాయుడుపాలెం గ్రామస్తులు అలయనిర్మాణానికి వితరణ



పరవాడ: పరవాడమండలము రావాడ గ్రామ పంచాయతీ శివారు సోమినాయుడుపాలెం గ్రామస్తులు జల్లెలపాలెం గ్రామ దేవత శ్రీ మరిడి మాంబ ఆలయ నిర్మాణమునకు గ్రామస్తులు అందరూ కలిపి జిల్లా తెలుగుయువత అర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపు చిన్నా, సారిపల్లి జోగి నాయుడు చేతుల మీదగా 28000/- రూపాయలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు అప్పల నాయుడు, సిరపురపు సన్యాసి రావు, బండారు అప్పలనాయుడు, కూండ్రపు నాయుడు, మేడి శెట్టి సోమినాయుడు, కూండ్రపు శ్రీను, అప్పారావు, సిరపురపు నాయుడు, సన్యాసిరావు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## గ్రామ వాలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు

చీడికాడ : మండలంలోని వివిధ గ్రామాలలో 17 వలంటీర్ పోస్టులు ఖాళీలు వున్నాయని, వీటి భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుందని ఎంపీడీవో వి.జయలక్ష్మి తెలిపారు. వడ్డాది మేజర్ పంచాయితీలో 5, డిబ్బిడిలో 3, బుచ్చెయ్యపేటలో 2, కోమాళ్లపూడి, చిన అప్పన్నపాలెం, మల్లాం, తైపురం, తురకలపూడి, చింతపాక, గున్నెంపూడిలలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా వుందని ఆమె అన్నారు. ఈ పోస్టుల భర్తీకి నవంబర్ 1వతేదీన ప్రకటన వెలువడుతుందని, 10వతేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారు డిసెంబర్ 1వతేదీ నుండి విధుల్లో చేరుతారని ఆమె వివరించారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి 18 నుండి 35 సం॥రాల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తుకి అర్హులని ఎంపీడీవో అన్నారు.

## మత్స్యకారులకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుంది

**మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత**

ఎస్.రాయవరం : గడిచిన 18రోజులుగా జీవనోపాధి కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న మత్స్యకారులకు అండగా వుంటామని తెలుగుదేశం పార్టీ వుంటుందని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. నిరసన తెలుపుతున్న మత్స్యకారుల శిబిరం వద్దకి వెళ్ళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మత్స్యకారులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తమ హక్కులు కోసం పోరాడుతున్న మత్స్యకారులపై కేసులునమోదు చేయడం దారుణమన్నారు. మత్స్యకారుల జీవనోధారమైన వరహా, శారదా నదులను డ్రెడ్జింగ్ పేరుతో మూసివేసి జీవనోపాధి కోల్పోయేలా చేయడం తగదన్నారు. జెట్టీ నిర్మాణానికై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చిత్ర లేఖనం పోటీలు

భీమునిపట్నం: బాలల దినోత్సవం,పండిట్ జవహర్ లాల్ పుట్టినరోజు సందర్భంగా 6,7,8వ తరగతుల విద్యార్థిని, విద్యార్థులకు మంగళ వారం యువభారత్ భీమిలి శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిం చారు. ఈ చిత్రలేఖనం పోటీల కు భీమిలి పరిధిలో గల స్కూల్స్ నుంచి విద్యార్థినీ, విద్యార్థులు సుమారు యాబై మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు నవంబర్ 14న బహుమతులు అందజేయనున్నట్లు యువ భారత్ భీమిలి శాఖ కన్వీనర్ సంకురుభుక్త జోగారావు తెలిపారు.

# మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు

## మొకర నారాయణరావు 85వ వర్ధంతి



భీమునిపట్నం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వర్గీయ మొకర నారాయణ రావు 85వ జయంతి ని పురస్కరించుకుని భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షుడు గంటా నూకరాజు ఆద్వర్యంలో భీమిలి జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొకర నారాయణ రావు భీమిలి తెలుగుదేశం పార్టీకి వెన్నుముక లాంటివారని, అన్న నందమూరి తారకరామారావు గారు 1982లో పార్టీని స్థాపించి నప్పటినుండి పార్టీలో ఉండి పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారని. భీమిలి రాజకీయాల్లో ఎంతోమంది యువతకు రాజకీయ మార్గదర్శకులని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎంతోమంది వివిధ రంగాల్లో స్థిరపడినవారు ఉన్నారని, పార్టీల కతీతంగా ఎంతోమందికి ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించారని అన్నారు.ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్ గా అత్యున్నతమైన పదవులను అనుభవించి భీమునిపట్నం కి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు వచ్చేవిధంగా కృషి చేశారని గంటా నూకరాజు తెలియజేసారు. మొకర నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని, మొకర నారాయణ రావు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గాడు సన్యాసినాయుడు, కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు, కె.ఎస్.ఆర్.క ృష్ణారావు, కంచెర్ల కామేష్, సంకురు భుక్త జోగారావు, అప్పి కొండ.నూకరాజు, గండిబోయిన పోలిరాజు, దాసరి వెంకటేష్, రాజగిరి రమణ, వాసుపల్లి వంశీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## వైద్య రంగంలో సంస్కరణలకు శ్రీకారం

రంగంలో సంస్కరణల అమలుకు కమిటీని నియమిస్తున్నట్టు సీఎం జగన్ చెప్పారు. కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంను నియమిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు. కో చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ సుజాతారావును నియమించారు. వివిధ విభాగాలకు చెందిన 10 మందిని సభ్యులుగా నియమిస్తున్నట్టు సీఎం వెల్లడించారు. దీంతోపాటు రాష్ట్రంలోని బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను స్వయం ప్రతిపత్తి సంస్థలుగా మార్చేందుకు సీఎం ఒక కమిటీని నియమించారు. వైద్యవిద్య డైరెక్టర్, ఏపీవీవీపీ కమిషనర్, మాజీ వీసీ ఐవీ రావు, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం ఎండీ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈమేరకు వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలపై ఏర్పాటైన కమిటీతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో తాము గుర్తించిన అంశాలపై కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.బాలకృష్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా.. అమ్మఒడి, నాడు-నేడు కార్యక్రమాలపై సంస్కరణల కమిటీ ప్రశంసలు కురిపించింది.

## మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

మాత్రమే మహిళలు ఉన్నారని వెంకయ్య నాయుడు చెప్పారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించాలని రాజకీయ పార్టీలను కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబరు 23 నుంచి ప్రారంభమవుతాయి. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని ప్రతిపాదించిన బిల్లు చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించింది.

పార్లమెంటు పనితీరును మెరుగుపరిచేందుకు సంస్కరణలు తేవాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. నాణ్యమైన చట్టాలను, సంపూర్ణ సమాచారం తెలిసియుండి రూపొందించేందుకు వీలుగా చట్టాల రూపకల్పనకు ముందు, ఆ తర్వాత దాని ప్రభావాన్ని మదింపు చేయాలని చెప్పారు. చట్టాల రూపకల్పనలో ప్రమేయమున్నవారినందరినీ భాగస్వాములను చేయడంతోపాటు సాంఘిక, ఆర్థిక, పర్యావరణ, పరిపాలనా ప్రభావాలను ప్రకటించడం ద్వారా లక్షిత ఫలితాల గురించి విస్తృత అవగాహన కలిగించేందుకు ఈ మదింపు దోహదపడుతుందని చెప్పారు.

## బోరు బావిలో పడిన చిన్నారి సుజిత్ కథ విషాదాంతం

డాక్టర్లు గుర్తించారు. అర్ధరాత్రి తర్వాత బాలుడు చనిపోయినట్లు గుర్తించారు. బోరు బావిలో నుంచి కుళ్లిన వాసన రావడంతో మళ్లీ వైద్యుల్ని పిలిచి పరిశీలించారు.

కొద్దిసేపటికి సుజిత్ విల్సన్ చనిపోయినట్లు డాక్టర్లు తేల్చారు. ఈ విషయాన్ని అధికారులు కూడా ప్రకటించారు. వేకువజాము సమయంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మనప్పారై ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టమ్ నిర్వహించి.. తల్లిదండ్రులకు అప్పగించారు. కన్నబిడ్డ విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు శోక సంద్రం మునిగిపోయారు.

## మహిళలకు అవగాహన పెరగాలి

ప్రారంభించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. జీవనశైలిలో మార్పుల కారణంగా ఎక్కువమంది మహిళలు రొమ్ముక్యాన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఆహార విషయాల్లో జాగ్రత్తలు పాటిస్తూ, పౌష్టికాహారం? తీసుకొని రోగనిరోధక శక్తి పెంచుకోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్‌పై మరిన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులను కోరారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80 శాతం అమలు



నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50 శాతం కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 4 లక్షల గ్రామ సచివాలయ ఉద్యోగాలు కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు యేటా 10 వేల రూపాయలు ప్రభుత్వం సహాయంగా అందిస్తుందని చెప్పారు. వై.యస్.ఆర్.రైతు భరోసా కింద రైతులకు 13,500 రూపాయలు ప్రభుత్వం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగ పడే ఎన్నో కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టబోతున్నట్లు ఆయన వివరించారు. నాడు నేడు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభిద్ధి సంస్థలను పార్లమెంటుకు ఒకటి పెడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రాధాన ఆదాయమార్గమైన మధ్యపానంను రాష్ట్రంలో దశల వారీగ మద్యపాన నిషేదం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని ఆయన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని ఆయన కోరారు. అక్షరాస్యతలో దేశంలో కేరళ రాష్ట్రం ముందున్నదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా శత శాతం అక్షరాస్యత సాధించి నంబర్ వన్ గా నిలుస్తుందని చెప్పారు. అందుకు పిల్లలందరును పాఠశాలలకు పంపాలని తెలిపారు. వై.యస్.ఆర్. ఆరోగ్య శ్రీ, అమ్మ ఒడి, రైతులకు వై.యస్.ఆర్. రైతు భరోసా, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం, ఫించన్లు పెంపు వంటివి ప్రభుత్వం ఇస్తున్నట్లు ఆయన వివరించారు. దశల వారీగ మద్యపాన నిషేదం అమలు జరుగుతుందన్నారు. . ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని, డ్వా క్రా మహిళలకు ముఖ్యమంత్రి ఋణమాఫీ చేసినట్లు ఆయన వివరించారు. భీమిలి శాసన సభ నియోజక వర్గంలో బ్యాంకు లింకేజి కింద 1639 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు 56.86 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భీమునిపట్నం మండలంలో 567 గ్రూపులకు 17.65 కోట్లు, ఆనందపురం మండలంలో 495 గ్రూపులకు 16.20 కోట్ల రూపాయలు, పద్మనాభం మండలంలో 577 గ్రూపులకు 23.01 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. స్త్రీ నిధి కింద భీమిలి నియోజక వర్గంలో 2276 సభ్యులకు 11.24 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు చెప్పారు. భీమునిపట్నం మండలంలో 793 సభ్యులకు 3.92 కోట్ల రూపాయలు, ఆనందపురం మండలంలో 771 సభ్యులకు 3.79 కోట్ల రూపాయలు, పద్మనాభం మండలంలో 712 సభ్యులకు 3.53 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద వారికి ఆర్థిక సహాయం, రైతులకు వై.యస్.ఆర్. రైతు భరోసా, పాఠశాలలకు వెళ్లే పిల్లల తల్లుకు అమ్మ ఒడి, ఇలా ప్రతి ఒక్కరికి మేలు కార్యక్రమం ఈ ప్రభుత్వం తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. విఎంఆర్డిఎ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఋణాలు మాఫీ, బ్యాంకు లింకేజిలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఈ ఋణాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని చెప్పారు. జివియంసి కమీషనర్ డా.జి. సృజన మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించడానికి, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

అంతకు ముందు జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు గుడివాడ అమర్ నాథ్, నర్సీపట్నం శాసన సభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్, జివియంసి కమీషనర్ డా.జి. సృజన, డిర్డిఎ ప్రాజెక్టు డైరక్టర్ విశ్వేశ్వరరావు, యుసిడి పిడి. శ్రీనివాసరావు, పక్కి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.



# భవ్యమంజీరకు వర్సిటీ డాక్టరేట్

## అభినందించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమికల్ ఇంజనీరింగ్ విభాగ పరిశోధకురాలు పి. భవ్య మంజీరకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పులిపాటి కింగ్ పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ బెనిఫికేషన్ ఆఫ్ వేల్యూ ఏడెడ్ హెవీ మినరల్స్ ఫ్రం మినరల్ సెపరేషన్ ప్లాంట్ రిజక్ట్స్- ఏ వెల్త్ ఫ్రం వేస్ట్ అప్రోచ్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో భవ్య మంజీరకు డాక్టరేట్ ఉత్తర్వులను అందజేసి అభినందించారు. బీచ్ సాండ్‌ను ఉపయోగించి పనిచేసే మినరల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో ఉత్పన్నమయ్యే వ్యర్థాల నుంచి విలువైన లోహాలను వేరుచేయడానికి నూతన విధానాన్ని అభివృద్ధి చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా భవ్య మంజీరను విభాగ ఆచార్యులు,పరిశోధకులు, విద్యార్థులు పలువురు అభినందించారు.

# అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం

## డి.ఎస్పీ ఎ.సి.బి బి.వి.ఎస్.నాగేశ్వరరావు



విజయనగరం : అక్టోబరు 28 నుండి నవంబరు 2వ తేదీ వరుకు జరుగుతున్న విజెలెన్స్ అవగాహనా వారోత్స వాలలో భాగంగా మంగళవారం విజయనగరం అవినీతి నిరోధక శాఖ డి.ఎస్పీ బి.వి.ఎస్. నాగేశ్వరరావు, ఇన్ స్పెక్టర్లు మరియు సిబ్బంది విజయ నగరం తహశీల్దారు కార్యాలయం ఆవరణలో అవినీతికి వ్యతిరేఖంగా ప్రజలలో అవగాహన కల్గించే విధంగా గోడ పత్రికలు అతికించారు, అంతేకాకుండా విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మరియు మండల కేంద్రాలలోగల ప్రభుత్వ కార్యాలయాలలోనూ మరియు ముఖ్య జనసమర్ధ కూడళ్లలోనూ గోడపత్రికలు అతికించారు మరియు అవినీతికి వ్యతిరేఖంగా అవగాహన కల్గించే విధంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్పీ మాట్లాడుతూ విజెలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా ప్రజలలో అవినీతికి వ్యతిరేఖంగా అవగాహన కల్పించే విధంగా ఫోన్ నెంలు. 9440446174/ 9440446176/ 9440446179/ 9491305633 తెలియజేసే విధంగా గోడ పత్రికలను జిల్లాలోని ముఖ్య ప్రాంతాలలో అతికిస్తున్నామని మరియు కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా విజయనగరం తహశీల్దారు కార్యలయం సిబ్బందికి మరియు గ్రామ రెవె న్యూ అధికారులకు అవినీతి నిర్మూలన గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా డి.ఎస్పీ మాట్లాడుతూ సమయ పాలన పాటించాలని తెలియజేశారు.


**కెనరా బ్యాంక్** | మురళీనగర్ బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2547968

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారు మా బ్యాంకు శాఖనందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు చెల్లించాల్సిందిగా బ్యాంకు వారు పలుమార్లు కోరినను, నోటీసులు పంపినను, వారు తమ బాకీలు చెల్లించలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలను మా బ్యాంకు శాఖ ఆవరణలో **తేది. 07-11-2019 గురువారం మధ్యాహ్నం 3 గం॥లకు** బహిరంగ వేలము వేసి వారి పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఖాతాదారునికి ఎవరికైనను బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారుడు మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

| ఖాతా నెంబరు | ఖాతాదారుని పేరు మరియు చిరునామా | లోను తేది |
|---|---|---|
| 2958842003151 | **డి.వి. గురునాధరావు,** తండ్రి: డి. అప్పారావు, డోర్ నెం. 12-131, మునగపాక, విశాఖపట్నం-531033 | 09-10-2015 |

తేది. 30-10-2019, ప్రదేశం: విశాఖపట్నం — సం/- బ్రాంచ్ మేనేజర్



**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఎస్ఇఆర్/19-20/124**

1. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా డిజిటల్ సీల్డ్ టెండర్లు 02 సేవలను సేవా కోసం ఆహ్వానించబడ్డాయి, యాంకోరేజ్ - మిలన్ 2020 లో నీటి సేవలను అందించడానికి రోజువారీ ప్రాతిపదికన స్వయంచాలక నీటి బ్యారేజీలు ఏర్పాటు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: **www.defproc.gov.in** నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 95,600/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.
3. **ప్రి-బిడ్డు సమావేశం:** ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 05 నవంబరు 19/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.
4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి **16 నవంబరు 19 (1830 గం.లు)** లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0179/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**


# శివరామకృష్ణ దేవాలయంలో కార్తీక మాస మహోత్సవాలు

విశాఖపట్నం: అస్సాం గార్డెన్స్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో కార్తీకమాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించదలచి నాము. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో వేంచేసియున్న శ్రీ ఉమా చంద్ర మౌళీశ్వరునికి అభిషేకములు, పంచామృతాభిషేక ములు, విభూది అర్చన, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకములు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించబడును. అదేవిధంగా కార్తీకమాసం సందర్భంగా 31వ తేదీన నాగుల చవితి, నాలుగు కార్తీక సోమవారములతోపాటు 22వ తేదీ కార్తీక శుద్ధ ఏకాదశి, 25వ తేదీ సోమవారం స్వామి వారికి సామూహిక రుద్రాభిషేకం జరుగుతుంది. 27వ తేదీ పోలి స్వర్గంతో కార్తీకమాస మహోత్సవాలు నిర్వహించబడుతాయి. కార్తీక మాసం నాలుగు సోమవారములు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ (నారాయణసేవ) జరుగును. పై కార్తీక మాస మహోత్సవములో పాల్గొనదలచినవారు నేరుగా ఆలయంలో గల దేవస్థానం కౌంటర్‌నందు సిబ్బందిని సంప్రదించి పూజాదిరుసుములను చెల్లించి తమ గోత్రనామములను నమోదు చేసుకొని తప్పక తగు రసీదు పొందవలెను. మరిన్ని వివరముల కొరకు 94928 16692 నందు సంప్రదించవలెను.

# 1న డయల్ యువర్ యూనివర్సిటీ

## విద్యార్థుల సందేహాలకు ఫోన్‌లో సమాధానమివ్వనున్న అధికారులు

ఆంధ్రవిశ్వ కళాపరిషత్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రతీ నెల మెదటి శుక్రవారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నారు. నవంబరు 1వ తేదీ ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు వర్సిటీ అధికారులు విద్యార్థుల సందేహాలకు ఫోన్‌లో సమాధానమిస్తారు. విద్యార్థులు 0891 2844455 నంబరుకు ఫోన్ చేసి తన సందేహాలకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చును. ప్రతీ నెల మొదటి శుక్రవారం డయల్ యువర్ యూనివర్సిటీని నిర్వహించడం జరుగుతుదని పరిపాలనా విభాగం డిఆర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## *బంగారు ఆభరణాల వేలం ద్వారా బ్యాంకుకు 56 లక్షల 45 వేలు ఆదాయం*



సింహాచలం: 72 వ వార్డు పరిధి సింహాచలం అడివివరం కో ఆపరేటివ్ బ్యాంక్ లో 2016 మార్చి వరకు కొదవ పెట్టి విడిపించని బంగారు ఆభరణాల వేలం మంగళవారంతో ముగియ గా వేలంద్వారా బ్యాంక్ కు 56 లక్షల 45 వేల 600 రూపాయలు ఆదాయం సమకూరి నట్టు మూడు బ్రాంచ్ లు కలిపి సుమారు 1865.3 గ్రాములు బంగారము 191 వివిధ వస్తువులు ద్వారా ఈ నగదు సమకూరినట్టు బ్యాంక్ అధ్యక్షుడు కర్రి స్వామి తెలియ జేశారు ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ బంటుబిల్లి మహేష్ కోరాడ ఈశ్వర రావు లోగిశ గణేష్ సతివాడ శంకర్ రావు కొలుసు గురునాథ్ ఇతర డైరెక్టర్లు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో ఉత్పత్తికి సిద్ధమైన డైకీ

అమరావతి: వందేళ్ల చరిత్ర కలిగిన జపాన్ దిగ్గజ ఉక్కు సంస్థ డైకీ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తికి సిద్ధమైంది. డైకీ అల్యూమినియం సంస్థకు చెందిన ప్రతినిధులు మంగళవారం ఏపీ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కలిశారు. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్న తమ ప్లాంట్ వివరాలను మంత్రికి వెల్లడించారు. ఏడాదిలోగా ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సంచలన నిర్ణయాలు, సంస్కరణలను గురించి డైకీ ప్రతినిధులకు మంత్రి వివరించడంతో.. ఏపీ అభివృద్ధి దిశగా ముందుకెళుతోందని వారు హర్షం వ్యక్తం చేశారు. నాణ్యమైన ఉక్కును అందించడంలో ఏమాత్రం రాజీపడకుండా ముందుకు వెళుతున్న డైకీ సంస్థను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. డైకీ ఉక్కు కర్మాగారానికి అవసరమైన ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని చేపడతామని వారితో మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చెప్పారు.

# జాతీయ ఉత్తమ మండల పరిషత్ గా సబ్బవరం

## ఎంపిడిఓ రమేష్ నాయుడు





విశాఖపట్నం : జాతీయ ఉత్తమ మండల పరిషత్ గా సబ్బవరం మండలం ఎంపికైనట్లు సబ్బవరం ఎంపిడిఓ బి. రమేష్ నాయుడు మంగళవారం తెలిపారు. దీన్ దయాళ ఉపాధ్యాయ పంచాయితీ స్వశక్తీకరణ పురస్కార్-2019 సబ్బవరం మండలానికి దక్కింది. ఈ నెల 23వ తేదీన ఢిల్లీలో జాతీయ సైన్స్ కాంప్లెక్స్ లో దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయితీ స్వశక్తీకరణ పురస్కార్-2019 నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చేతులు మీదుగా సబ్బవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. రమేష్ నాయుడు అందుకున్నారు. అవార్డు తీసుకొని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ ను ఎంపిడిఓ బి. రమేష్ నాయుడు కలిసారు. మండలంలోని అన్ని శాఖలను సమన్వయం చేసి ఆయా శాఖల పనితీరును జాతీయ బృందం పరిశీలించినపుడు ఆయా శాఖల పనితీరు జాతీయ పరిశీలనా బృందాన్ని ఆకట్టుకుందని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వి. వినయ్ చంద్ సబ్బవరం ఎంపిడిఓ బి. రమేష్ నాయుడును అభినందించారు. ఈ అవార్డుకు సాధించడానికి సూచనలు, సలహాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, జిల్లా పరిషత్ సిఇఓ రమణమూర్తి, మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులు, ప్రజలకు మరియు పాత్రికేయులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంక్షేమ పథకాల కార్యాచరణకు కలెక్టర్లు సిద్ధం కావాలి

**వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి ఆదేశాలు .. డిసెంబరు 15 నాటికి గ్రామ సచివాలయాలు సిద్ధం చేయాలి**
**నవంబర్లో కంటి వెలుగు 2వ దశ కార్యక్రమం ప్రారంభం.**
**వేట నిషేధం సమయంలో నష్టపరిహారం ఇకపై రూ.10 వేలు ఉగాది నాటికి ఇళ్ల స్థలాలు పంపిణీ**




విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంను సమర్ధవంతంగా నిర్వహించాలని, స్పందనలో రాష్ట్రంలో 6,99,548 ఆర్జీల లో 56% ఇల్లు రేషన్ కార్డులు పింఛన్ల కొరకే వచ్చాయన్నారు. వాటన్నింటినీ పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితాను సామాజిక తనిఖీ కి గాను గ్రామ వార్డు సెక్రటేరియట్ ల వద్ద ప్రదర్శించాలని చారు ఆదేశించారు. డిసెంబరు 15 నాటికి గ్రామ సచివాలయాలు పూర్తి స్థాయిలో పనిచేయుటకు సిద్దం చేయాలని, సచివాలయం ప్రక్కనే నాణ్యమైన విత్తనాలు లభ్యంగా వీటన్నింటికీ జిల్లా కలెక్టర్ లు కార్యాచరణ ప్రణాళికలను సిద్దం చేయాలని ఆదేశించారు.వాలంటీర్లు, సచివాలయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు.ఇసుకపై జిల్లాలో కొన్ని చర్యలు చేపట్టాలని, జిల్లాలోని పరిస్థితిపై ప్రజలకు స్టేట్మెంట్ స్పష్టత ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల అన్నింటిని అమలు చేస్తున్నట్లు, వారి ఆదేశాల మేరకు అన్ని పథకాలకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో విశాఖపట్నం నుండి జెసి 2 ఎన్ వి సూర్యకళ, డి ఆర్ వో ఎం శ్రీదేవి,మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. కోటేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 1వ తేదీ నుండి ఆరోగ్య శ్రీ క్రింద ఇతర రాష్ట్రాలలో 131 ఆసుపత్రుల్లో చికిత్సకు అవకాశం కల్పిస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ధృవీకరించిన 500 రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో లభ్యం అవుతాయని చెప్పారు నవంబర్ నెలలో కంటి వెలుగు 2వ దశ కార్యక్రమం ప్రారంభమవుతుందని 500 బృందాలు ఏర్పాటు చేశారని అవసరమైన కళ్ళాద్దాలను చిన్నారులకు పంపిణీ చేస్తారు అన్నారు.నవంబర్ 7న రూ.10 వేల లోపు డిపాజిట్ గల అగ్రిగోల్డ్ బాధితులకుల చెల్లింపు జరుపుతామన్నారు రాష్ట్రంలో రూ.265 కోట్లను 3.69, 665 మంది ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నవంబర్ 14న పాఠశాలల్లో నాడు - నేడు కార్యక్రమం చేపడతామని, మార్చి నెలాఖరుకు ప్రతి పాఠశాలలో అన్ని మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు వచ్చే ఏడాది నుండి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్ల బోధన పాఠశాలలుగా మార్పు చేసి మాతృభాషకు కూడా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం. మత్స్యకారులకు సబ్సిడీపై డీజల్ సరఫరా చేస్తామని, కొనుగోలు చేసినప్పుడే డీజిల్ ధర తగ్గించే విధంగారాష్ట్రంలో 81 ఔట్ లెట్స్ ఏర్పాటు చేస్తానన్నారు. వేట నిషేధం సమయంలో గతంలో రూ.4 వేలు ఇచ్చిన నష్టపరిహారంను ఇకపై రూ.10 వేలు సముద్రంలో వేటకు వెళ్లే తెప్పలకు కూడా పరిహారం. రాష్ట్రంలో 1,31,332 కుటుంబాలకు లబ్ది చేకూరుతుందన్నారు. డిసెంబరు 3వ తేదీన యువ న్యాయవాదులకు 3 సంవత్సరాల పాటు సహాయం అందించే పథకం ఉగాది నాటికి ఇళ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమం. 22.69 లక్షల మందికి పట్టాలు ఇస్తామన్నారు.రైతు భరోసా, వై యస్ ఆర్ వాహన మిత్ర లబ్ధిదారుల ఎంపికకు నవంబర్ 15 గడువు ఉందన్నారు వై యస్ ఆర్ రైతు భరోసా క్రింద ఇప్పటి వరకు 40.03 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరి నట్లు తెలిపారు.



### *1న ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం*

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1వ తేదీన నిర్వహించాలని అన్నారు.

# నవంబర్ 3న పవన్ కళ్యాణ్ తలపెట్టిన లాంగ్ మార్చ్‌ను జయప్రదం చేయండి



గాజువాక: ఇసుక సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీన విశాఖపట్నంలో తలపెట్టిన లాంగ్ మార్చ్ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని జనసైనికులు పిలుపునిచ్చారు. జనసేనా నాయకుడు ముమ్మన మురళి ఆధ్వర్యంలో మంగళవారం 52వ వార్డులో ఉన్న భవన నిర్మాణకార్మికులను కలిసి అవగాహన కల్పించారు. ఇసుక సమస్య పరిష్కారంకోసం పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న లాంగ్‌మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జనసేననాయకుడు మురళి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక ఆన్‌లైన్ విధానం వలన, భవననిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని, పనులు లేక ఆర్ధికంగా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడి 5నెలలు గడుస్తున్న ఇసుక సమస్యను పరిష్కరించకపోవడం దారుణమని మండిపడ్డారు. అధిష్టానం పిలుపు మేరకు భవన నిర్మాణకార్మికులును కలిసి లాంగ్ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ భవననిర్మాణ కార్మికులు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 52వ వార్డు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## విజయభాను సంపాదకీయం

### శివసేనతో పేచీ

ఇటీవల రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత బీజేపీకి మహారాష్ట్రలో పెద్దగా సమస్య లేదనీ, హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటే కష్టమని అనిపించింది. కానీ హర్యానాలో ప్రాంతీయ పార్టీతో పొత్తు పెట్టుకొని బయటపడిన బీజేపీకి శివసేన పీటముడిని విప్పడమే కష్టంగా మారింది. ఎన్నికల ముందే తమకు కుదిరిన అంగీకారం ప్రకారం- మంత్రివర్గంలో చెరి సగం సీట్లు పంచుకోవాలని శివసేన అంటున్నది. ముఖ్యమంత్రి పదవి కూడా చెరి సగం కాలం చేపట్టాలని కోరుతున్నది. ఈ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి 105, శివసేనకు 56, కాంగ్రెస్‌కు 44, ఎన్సీపీ కి 54 సీట్లు లభించాయి. సీట్ల పంపకాల సమయంలోనే బీజేపీ ఎక్కువ స్థానాలకు పోటీ చేసింది. శివసేన చిన్న భాగస్వామిగా ఉండటానికి అంగీకరించక తప్పలేదు. ఇప్పుడు 105 సీట్లు తెచ్చుకు న్న బీజేపీ శివసేనకు సమానస్థాయి ఇవ్వడానికి సిద్ధంగా లేదు. ముఖ్యమంత్రి పదవిని చెరికొంత కాలం చేపట్టాలనే డిమాండును అంగీకరించడానికి అసలే సిద్ధంగా లేదు. తమకు ఇతర ప్రత్యామ్నాయాలున్నాయనీ, అయినా బీజేపీతో హిందుత్వ బంధాన్ని వదులుకోదలుచుకోలేదని కూడా శివసేన పరోక్షంగా హెచ్చరించింది. ఇతర ప్రత్యామ్నాయాలు అంటే కాంగ్రెస్, ఎన్సీపీ మద్దతు తీసుకోవడమే! కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి నుంచి కూడా కొందరు ఇందుకు అనుకూలంగా మాట్లాడా రు. లౌకిక కూటమి ఎంతవరకు సిద్ధంగా ఉందనేది వేరే విషయం. బీజేపీని శివసేన ఏ స్థాయిలో బెదిరిస్తున్నదనేది ఈ ప్రత్యామ్నాయ వ్యాఖ్యను బట్టి తెలుస్తున్నది. ఒకప్పుడు శివసేనను నడిపిన బాల్ ఠాక్రే ఎప్పుడూ ఎన్నికలలో పోటీ చేయలేదు. ఇప్పుడు ఉద్ధ వ్ ఠాక్రే కూడా ఎన్నికలకు దూరమే. కానీ ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారు. ఆదిత్యను దృష్టిలో పెట్టుకునే శివసేన సగకాలం ముఖ్యమంత్రి పదవి కూడా అడుగుతున్నది. కానీ శివసేన పట్టుబట్టడానికి కొన్ని పరిస్థితులు దోహదప డ్డాయి. 2014 ఎన్నికలలో 122 సీట్లు తెచ్చుకు న్న బీజేపీ ఈ సారి 105 మాత్రమే సాధించగలిగింది. సొంతంగా మెజారిటీ సాధించాలన్న అం చనాలు మారాయి. శివసేన సీట్లు కూడా 63 నుంచి 56కు తగ్గాయి. కానీ బీజేపీ బలహీనపడ్డదని, మోదీ గాలి లేదని తెలువడంతో శివసేన ధైర్యం పెరిగింది. రెండు పార్టీల మధ్య ఉన్నది హిందుత్వ బంధమని శివసేన అన్నప్పటికీ అది పైకి చెప్పుకోవడానికే. వాస్తవికంగా రెండు పార్టీల మధ్య ఉన్నది ఒక జాతీయ పార్టీకి, ప్రాంతీయ పక్షానికి మధ్య గల ఘర్షణ. బీజేపీ ఏదైనా రాష్ట్రం లో అడుగు పెట్టే ముందు అక్కడి ప్రాంతీయ పార్టీని దువ్వడం మొదలుపెడుతుంది. మిత్రపక్షంగా అడుగుపెట్టి, అరబ్బు ఒంటె మాదిరిగా గుడారంలో కొంచెం తలదూరుస్తానని అడుగుతుంది. చివరికి ప్రాంతీయ పార్టీని గుడారం నుంచి గెంటేయాలని చూస్తుంది. హర్యానాలో బీజేపీ మిత్రపక్షంగా మారక ముందు ఐఎన్ఎల్ డీ బలంగా ఉండేది. ఆ తరువాత కోర్టు కేసులు, ఇతర ఒత్తిడులు, ఎత్తుగడల మూలంగా ఐఎన్ఎల్‌డీ బలహీనపడ్డది, బీజేపీ బలపడుతూ పోయింది. ప్రాంతీయ పార్టీల ఆయువు పట్టును దెబ్బకొట్టడం జాతీయపక్షాలకు అలవాటే. బీజేపీ, శివసేన కూడా ఇదే ఘర్షణపూరిత పరిస్థితుల్లో మిత్రపక్షాలుగా సాగుతున్నాయి. బీజేపీ ముఖ్యమం త్రి పదవి, మంత్రి పదవులను పంచుకోవాలనే విషయమై రాతపూర్తక హామీ ఇవ్వాలని కోరుతున్నదీ అంటే అపనమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. శివసేన అనేకసార్లు శరద్ పవార్ పట్ల అనుకూలత ప్రకటించడం ఈ ప్రాంతీయ సౌహార్ద్రతతోనే. ఒడిశాలో బీజేడీ మిత్రపక్షం గా అడుగుపెట్టి తాను బలపడుతున్నట్టు భావించి, ఆ పార్టీని దెబ్బకొట్టాలని చూసింది. కానీ నవీన్ పట్నాయక్ నిలదొక్కుకోవడంతో సరిపోయింది. బీహార్‌లో లాలు నాయకత్వంలోని ఆర్‌జేడీ బలంగా ఉంటేనే నితీశ్, పాశ్వాన్‌ల అవసరం ఉంటుంది. లేకపోతే బీజేపీ వీరిని జాడించడానికి ఒక్కరోజు పట్టదు. 1960 దశకంలో ప్రాంతీయపార్టీలను ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అణిచివేసింది. కానీ ప్రాంతీయశక్తులను ఎదుగకుండా నిరోధించడం సాధ్యం కాలేదు. ఇవాళ దేశమంతటా ప్రాంతీయ పార్టీలున్నాయి. 1996 నుంచి 2014 వరకు ప్రాంతీయ పార్టీలు లేకుండా జాతీయస్థాయిలో ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమైంది. కాంగ్రెస్ బలహీనపడేవరకు సంకీర్ణ ధర్మం గురించి మాట్లాడిన బీజేపీ ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఆయువుపట్టును దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. ప్రాంతీయశక్తులను అణిచివేయడానికి బీజేపీ ఎంతకైనా దిగుతుందనడానికి పశ్చిమ బెం గాల్ పరిస్థితి ఉదాహరణ. ప్రాంతీయ శక్తులను తుడిచివేయడం సాధ్యం కాదని స్పష్టమవుతూనే ఉన్నది. ఐఎన్ఎల్‌డీని దెబ్బకొడితే మరోవైపు నుంచి జేజేపీ అవతరించింది. బీజేపీ- జేజేపీ పొత్తు పెట్టుకున్నప్పటికీ ఈ సంబంధం వైషమ్యపూరితంగానే ఉంటుంది. అందుకే అదను చూసుకొని శివసేన సవాలు చేస్తున్నది.

## జిల్లాలో ఇసుక పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలి



శ్రీకాకుళం: జిల్లాలో ఇసుక పరిస్థితిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ లతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత మూడు నెలలుగా వరదలు రావడంతో ఇసుక తవ్వకాలలో సమస్య ఏర్పడిందన్నారు. ఇసుకపై జిల్లాలో కొన్ని చర్యలు చేపట్టాలని, జిల్లాలోని పరిస్థితిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. ఇసుక విధానాన్ని పారదర్శకంగా చేపడుతున్నామని ముఖ్య మంత్రి చెప్పారు. ఇసుక రవాణాకు నిర్దేశించిన ధరకు ఎవరు వచ్చినా అవకాశం కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో 267 రీచ్ లలో 62 రీచ్ లు మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన వాటిలో వరద నీరు ఉందని చెప్పారు. వరద నీరు వారంలో తగ్గే అవకాశం ఉందని పేర్కొంటూ వారం రోజుల తరువాత ఇసుక వారోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లరాదని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. స్పందనలో రాష్ట్రంలో 6,99,548 అర్జీలు అందాయని వాటికి నాణ్యమైన పరిష్కారాలు ఉండాలని పేర్కొన్నారు. డిసెంబరు 15 నాటికి గ్రామ సచివాలయాలు పూర్తి స్థాయిలో పనిచేయుటకు సిద్దం చేయాలని ఆదేశించారు. సచివాలయం ప్రక్కనే ధ ృవీకరించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు లభ్యంగా ఉండాలని అన్నారు. అవినీతికి ఎక్కడా తావు వుండరాదని దీనిపై జిల్లా కలెక్టర్ లు, ఎస్పీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. నవంబర్ 1వ తేదీ నుండి ఆరోగ్య శ్రీ క్రింద ఇతర రాష్ట్రాలలోని 131 ఆసుపత్రుల్లో చికిత్సకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ ృవీకరించిన 500 రకాల మందులను నవంబర్ 20 నాటికి ప్రభుత్వ ఆసుపత్రులలో లభ్యంగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నవంబర్ నెలలో కంటి వెలుగు 2వ దశ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, రాష్ట్రంలో 500 బ ృందాలతో నేత్ర పరీక్షలు జరుగుతాయని అన్నారు. మొదటి దశలో జరిగిన కార్యక్రమంలో కళ్ళద్దాలు అవసరమైన చిన్నారులకు కళ్ళాద్దాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 7న రూ.10 వేల లోపు డిపాజిట్ గల అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రూ.265 కోట్లను 3.69, 665 మంది బాదితుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. నవంబర్ 14న పాఠశాలల్లో నాడు - నేడు కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కనీస అవసరాలతోపాటు ఇతర మౌళిక సదుపాయాలు ఉండాలి ప్రతి పాఠశాలలో మార్చి నెలాఖరుకు ఉండాలని అన్నారు. వచ్చే ఏడాది నుండి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్ల బోధన పాఠశాలలుగా మార్పు చెందుతున్నట్లు చెప్పారు. నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించి మత్స్యకారులకు సబ్సిడీపై డీజల్ పంపిణీ కార్యక్రమం, నష్టపరిహారం చెల్లింపు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 81 డీజిల్ ఔట్ లెట్స్ గుర్తించడం జరిగిందన్నారు. వేట నిషేధం సమయంలో గతంలో రూ.4 వేలు ఇచ్చిన నష్టపరిహారంను ఇకపై రూ.10 వేలు చేస్తున్నట్లు ప్రకటించారు. సముద్రంలో వేటకు వెళ్లే తెప్పలకు కూడా పరిహారం అందిస్తామని, రాష్ట్రంలో 1,31,332 మత్స్యకార కుటుంబాలకు లబ్ది కలుగుతుందని చెప్పారు. డిసెంబరు 3వ తేదీన యువ న్యాయవాదులకు 3 సంవత్సరాల పాటు సహాయం అందించే వై యస్ ఆర్ లా నేస్తం అమలు ప్రారంభిస్తామన్నారు. ఉగాది నాటికి ఇళ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమానికి అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు 22.69 లక్షల మందికి పట్టాలు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ లు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామ సచివాలయంలో జాబితాలు ప్రదర్శించాలని, ఏ మేరకు భూ సేకరణ చేయాలో అంచనా వేయాలని అన్నారు. అమ్మ ఒడి జనవరి 26న ప్రారంభం అవుతుందని చెప్పారు. వాలంటీర్లు, సచివాలయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. అవినీతి రహిత వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ఆయన చెప్పారు.

దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రైతు భరోసా, వై యస్ ఆర్ వాహన మిత్ర లబ్ధిదారుల ఎంపికకు నవంబర్ 15 గడువును పెంచామని అన్నారు. వై యస్ ఆర్ రైతు భరోసా క్రింద ఇప్పటి వరకు 40.03 లక్షల మంది రైతులకు లబ్ధిపొందారని చెప్పారు.

## విద్యార్థులు తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలి



మధురవాడ : మహా విశాఖ ఐదవ వార్డు పరిధి మారికవలస లో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ బాలుర పాఠశాలలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ను మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీ వాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు , గొడ్డేటి మాధవి మీ్రా, కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ తదితరలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సభలో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన బిమిలీ నియోజకవర్గం మారికవలస లో గల ఈ పాఠశాల నందు ఏర్పాటు చేయడం చాలా సంతోషం దాయకమని అభిప్రాయ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కొరకు అన్ని విధాల సహకరించి విద్యార్థుల భవిష్యత్తును చక్కదిద్దేందుకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్ కావాలని భవిష్యత్తులో మానవాళికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన నాట్య ప్రదర్శనలలో ఉపముఖ్యమంత్రి శ్రీ వాణి, భాగ్యలక్ష్మి పాల్గొని విద్యార్థులతోపాటు నృత్య ప్రదర్శన చేసి విద్యార్థులను ఆనందింప చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ను చూసి వాటి గురించి విద్యార్థులు లను అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన రాష్ట్రం నుండి 13 జిల్లాల్లోని వివిధ గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ విజ్ఞాన వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారని అని 17 వేల మంది విద్యార్థులు 308 రకాల నమూనాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారని. ఈ ప్రదర్శన వారి ప్రతిభకు అద్దం పట్టిందని గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థులు అందరూ మంచి నైపుణ్యత పెంపొందించడమే కాకుండా విద్య లో కూడా ప్రధాన స్థానంలో ఉన్నారని విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించే విధంగా ఈ ఎగ్జిబిషన్ను ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఐ టి డి ఏ , పాడేరు బాలాజీ, కన్వీనర్ లక్ష్మణరావు , స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలను అందరూ అలవరచుకోవాలి




మధురవాడ : మహా విశాఖ నాలుగో వార్డు పరిధి పి యం పాలం చివరి బస్ స్టాప్ నుండి పన్నెండవ రోజు గాంధీజీ సంకల్ప యాత్రను ఎమ్మెల్సీ పి వి ఎం మాధవ్ మంగళవారం ప్రారంభించారు. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ మాధవ్ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి ప్రారంభించిన గాంధీజీ సంకల్ప యాత్ర లో ఇప్పటివరకు 220 కిలోమీటర్ల యాత్ర చేశామని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అలాగే ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎవరికీ పనికిరాని ఈ వస్తువుని వాడవద్దని గాంధీజీ సూచించిన స్వదేశీ వస్తువులనే వాడాలని తెలిపారు.

ఈ యాత్రలో అనేకమంది గ్రామ పెద్దలను, నాయకులను , చేనేత, కొబ్బరి వంటి రైతులను కలిశామని వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని త్వరలో వీరందరికీ న్యాయం జరిగేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు, గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడవాలని ఆకాంక్షించారు. ఈ యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు ప్రమోద్ చక్రవర్తి, నాలుగో వార్డు బిజెపి అధ్యక్షుడు రాంబాబు, శ్రీనివాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాదక ద్రవ్యాల నియంత్రణపై

### చైతన్య సదస్సు : ఎన్.వై.కె. కో-ఆర్డినేటర్ ఎస్.శివప్రసాద రెడ్డి

శ్రీకాకుళం: మాదక ద్రవ్యాల నియంత్రణపై చైతన్య సదస్సును బుధవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.శివప్రసాద రెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్.వై.కె. కార్యాలయంలో

ఆయన పాత్రికేయులతో సమావేశాన్ని నిర్వహించారు. దేశానికి వెన్నెముక అయిన యువత మద్యానికి, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న తరుణంలో యువతను మంచి బాటలో నడిపిం చడానికి యువతకు అవగాహన కలిగించవలసిన ఆవశ్యకత వుందన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం శ్రీకాకుళం మరుయు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ మరియు మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్ మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో లిప్రివెన్షన్ ఆఫ్ డ్రగ్ ఎబ్యూజ్‌లి (మాదక ద్రవ్యాల నియంత్రణ) అనే అంశంపై చైతన్య సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ గ్రామంలోను....

ఇటువంటి అవగాహనా సదస్సులను నిర్వహించ వలసిన ఆవశ్యకత వుందన్నారు. కళాశాల విద్యార్థులు, విద్యార్థినులు, యువజన సంఘాలు, నిరుద్యోగ యువతకు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## జీవీయంసీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు



సింథియా (ములగాడ): విజిలెన్స్ ఎవర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా హెచ్‌పిసియల్ సంస్థ ఆధ్వర్యంలో జీవీయంసీ 46వవార్డులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీలను నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పోటీలలో పాఠశాల విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి.యస్.నాగభూషణం మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాకాలనీ గౌరీ పరమేశ్వర 25వ వార్షికోత్సవ

## మహోత్సవాల పత్రికా ఆవిష్కరణ



సింథియా(ములగాడ): ఇందిరాకాలనీ గౌరీ పరమేశ్వర ఆలయ 25వ వార్షికోత్సవ మహోత్సవాల పత్రికా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 48వ వార్డు ఇందిరాకాలనీలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని, వాటి ఔన్నత్యాన్ని బావితరాలకు తెలియజేయాలని అన్నారు. గౌరీ పరమేశ్వర ఉత్సవాలను గత 25సం.లుగా ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఉరుకూటి డేవిడ్, పాలిమేర శ్రీనివాసరావు, కొరిబిల్లిరాము తదితరులు పాల్గొన్నారు.

## నవాజ్ షరీఫ్ ఆరోగ్యం మరింత విషమం

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన రక్తంలోని ప్లేట్‌లెట్‌ల సంఖ్య తీవ్రంగా పడిపోయింది. ఈ వివరాలను ఆయన వ్యక్తిగత వైద్యులు వెల్లడించినట్లు పాకిస్థాన్ మీడియా మంగళవారం తెలిపింది. ఆయనను ఇటీవలే జైలు నుంచి ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. షరీఫ్ రక్తంలోని ప్లేట్‌లెట్‌ల సంఖ్య అత్యంత విషమ స్థాయి అయిన 2,000కు పడిపోవడంతో సోమవారం రాత్రి ఆయనను సర్వీసెస్ ఆసుపత్రికి తరలించారు. షరీఫ్ వ్యక్తిగత ఫిజిషియన్ డాక్టర్ అద్నాన్ ఖాన్ ఇచ్చిన ట్వీట్‌లో షరీఫ్ త్రాంబోసైటోపెనియా, గుండెపోటుతో బాధపడుతున్నారని, ప్లేట్‌లెట్‌ల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని తెలిపారు. మూత్రపిండాల పని తీరు కూడా క్షీణించినట్లు తెలిపారు.

## ఏపీలో మరో భారీ ఉద్యోగాల ప్రకటన

***19,170 వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్***

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగాల జాతరను కొనసాగిస్తోంది. రాష్ట్రంలో మరో ఉద్యోగాల ప్రకటన వెలువడింది. ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 19,170 వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు మున్సిపల్ శాఖ కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పూర్తి వివరాలను వెల్లడించారు.

మొత్తం 19,170 వార్డు వాలంటీర్ల ఖాళీలు భర్తీ
నవంబర్ 1 నుండి భర్తీ ప్రక్రియ ప్రారంభం
నవంబర్ 10 వరకు అభ్యర్థులు నుండి దరఖాస్తులు స్వీకరణ
నవంబర్ 15 వరకు దరఖాస్తులు పరిశీలన
నవంబర్ 16 నుండి 20 వరకు ఇంటర్వ్యూ లు
నవంబర్ 22న ఎంపికయిన వార్డు వాలంటీర్ల జాబితా ప్రకటన
డిసెంబర్ 1నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి

## సంచలనం రేపుతున్న ధోని రిటైర్మెంట్ !



హైదరాబాద్ : ప్రస్తుత భారత క్రికెట్‌లో ఎక్కువగా చర్చకు దారితీస్తున్న అంశం ధోని రిటైర్మెంట్ ఎప్పుడు?. ఇంగ్లండ్ వేదికగా ముగిసిన ప్రపంచకప్ అనంతరం ధోని ఇప్పటిరకు మైదానంలో అడుగుపెట్టలేదు. ప్రపంచకప్ టోర్నీ ముగిసిన తర్వాత తొలి రెండు నెలలు ఆర్మీకి సేవలందించాలనే ఉద్దేశంతో రెండు నెలలు క్రికెట్‌కు విరామమిచ్చాడు. ఆర్మీ ట్రైనింగ్ ముగిసిన అనంతరం కూడా ధోని తిరిగి టీమిండియాలో చేరలేదు. అయితే ధోని తనంతట తాను ఆడటం లేదా లేక సెలక్టర్లే అతడిని పక్కకు పెడుతున్నారా అనే ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాలి. ఇక ధోని వీడ్కోలుపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో ట్విటర్‌లో ఓ హ్యాష్ ట్యాగ్ సంచలనం సృష్టిస్తోంది.

మంగళవారం అనూహ్యంగా ట్విటర్‌లో ధోని రిటైర్మెంట హ్యాష్ ట్యాగ్ ట్రెండ్‌గా మారింది. కొంతమంది నెటిజన్లు ధోని సాధించిన ఘనతలు, రికార్డులను గుర్తుచేస్తూ రిటైర్మెంట్ హ్యాష్ ట్యాగ్‌ను జోడిస్తున్నారు. దీనితో పాటు అనే మరో హ్యాష్ ట్యాగ్ కూడా తెగ ట్రెండ్ అవుతోంది. దీంతో ధోని అభిమానులు తీవ్ర నిరాశ నిస్పృహలో ఉన్నారు. అయితే జార్ఖండ్ డైనమెట్ వీడ్కోలు వార్తలను ఖండిస్తున్నారు. అంతేకాకుండా అతడికి మద్దతుగా నిలుస్తూ అనే హ్యాష్ ట్యాగ్‌ను జోడిస్తున్నారు. ఇక ధోని వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ వరకు ధోని ఆడాలని అతడి అభిమానులు కోరుకుంటున్నారు.

ఇక ధోనికి ప్రత్యామ్నాయంగా జట్టులోకి వచ్చిన యువ సంచలనం రిషభ్ పంత్ ఏ మాత్రం ఆకట్టుకోకపోవడంతో.. సెలక్టర్లు సైతం ఈ సీనియర్ ఆటగాడిపై ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఈ క్రమంలో సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ధోనిపై ఓ క్లారిటీ వస్తుందని అందరూ భావించారు. అయితే రిటైర్మెంట్ విషయం ధోని వ్యక్తిగతమని, ఆ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరని గంగూలీ సింపుల్‌గా తేల్చిపారేశాడు. ఇక ధోనికి ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడించి ఘనంగా క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఇవ్వాలని సెలక్టర్లకు క్రీడా విశ్లేషకులు సూచిస్తున్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## అప్పన్న తులసీ దళం నిమిత్తం
# 1లక్షా 50 వేలు విరాళం



సింహాచలం : భక్తుల కొంగుబంగారం సింహగిరికొండపై వేంచేసియున్న సింహగిర వాసునికి విశాఖ అరుకు ప్రాంతానికి చెందిన శ్రీ వేంకట పద్మావతి జువలర్స్ అధినేత సాన దేముళ్ళ అనే స్వామిభక్తుడు 1 లక్షా 50 వేల రూపాయలు విరాళం ను స్వామి వారికి మూడు తులసీ దళంలు గాను సమర్పించారు ఈ చెక్ ను మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు ఆలయ ఈఓ ఎం.వెంకటేశ్వరరావుకి అందజేశారు. అనంతరం ఆలయ అధి కారులు వారికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



**44వవార్డు, గెడ్డ వీధి, జ్ఞానాపురంలో నివాసముంటున్న కడగాన కనక వారి భర్త గత 10 రోజుల క్రితం జాండిస్‌తో చనిపోయారు. పెద్దకర్మ కోసం రూ.5,000/-లు విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం చేసిన టీడీపీ లీడర్ కోడిగుడ్ల శ్రీధర్, ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ ఈరోతి చిన్ని కుమార్, రాజు, అన్నపూర్ణ, దేవి, రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.**

## ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీకొనడంతో
# వ్యక్తి అక్కడికక్కడే మృతి

నర్సీపట్నం : ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీకొనడంతో జిల్లేడు పూడి పంచాయతీ ఆర్ వెంకయ్య పాలెం గ్రామానికి చెందిన బొడ్డు వెంకట రమణ అనే యువకుడు శరభవరం గాంధీనగర్ మధ్యలో ఉన్న కల్వర్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారని నాతవరం ఎస్సై విజయభాను ప్రతినిధికి తెలిపారు.

## మండల కేంద్రంలో
# ధాన్యం కొనగోలు కేంద్రం ఏర్పాటు చేయరు..!
### పిఎసిఎస్ అధ్యక్షుడు అప్పన్న గజ్జయదొర

కొయ్యూరు : మండలంలో వరి పంట పండించే రైతులు , వరి పంట మీద ఆధారపడి ఉన్నారు. ఇంకొక 20 రోజులలో వరి పంట కోతకు అందుబాటులోకి వస్తుందని, కొయ్యూరు లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొయ్యూరు ప్రాథమిక పరపతి వ్యవసాయ సొసైటీ కేంద్రం వద్ద, వరి పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని, రైతులకు పంటలు సకాలంలో పండించేదుకు పెట్టి లైజర్ పిండి, మందులు అమ్మేం దుకు, అనువైన గౌడన్ ఉన్నాదిని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇచ్చామని, గజ్జ య్య దొర తెలిపారు. ఇప్పటికైనా అధి కారులు దృష్టిసారించి వ్యవసాయ సొసైటీ కేంద్రం వద్ద, వరి పంట కొను గోలు కేంద్రాన్ని కొయ్యూరులో ఏర్పాటుచేసి రైతులను ఆదు కోవాలని ఆయన కోరారు.

## అయ్యప్ప స్వాములకు
# అన్నదానం ప్రారంభం



బీమునిపట్నం: స్థానిక భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవాసంఘమ ఆద్వర్యంలో నలబై ఐదు రోజులు పాటు మహానారాయణ సేవా (నిత్య అన్నదానం) కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. భీమిలి బీచ్ వద్ద శ్రీ అయ్యప్ప స్వామి ధ్యాన మందిరంలో అయ్యప్ప స్వాములకు, శివమాల, భవాని మాల మరియు ఇతర దీక్షా పరులకు ఈ నెల 29 నుండి డిసెంబర్ 12 వరకు నలబై ఐదు రోజులు పాటు ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతాదని నిర్వాహుకులు తెలిపారు. ఈ కార్య క్రమమంలో ఆలయ గురుస్వామి బాలసుబ్రమణ్యం, భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవాసంఘమ లో అద్యక్షులు కె. ఎర్రి నాయుడు, ప్రధాన కార్యదర్శి డివివి దుర్గాప్రసాద్( వేణు ),కోశాదికారి నల్లి.నర్సింగరావు, సభ్యులు పెంట పల్లి యోగి, సుసారపు మాదవ శర్మ, కదిరి జగన్నాధం, గొరపల్లి సన్యాసిరావు, గుగ్గిళ్ళ.సాయి అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# ఇసుకరీచ్‌ల పరిశీలన



మాకవరపాలెం : మాకవరపాలెం మండలం లోని పలు గ్రామాల్లోని ఇసుకరీచ్‌లను రెవెన్యూ, గనులు, జలవనరుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. నర్సీపట్నం ఆర్డీవో గోవిందరావు, మాకవరపాలెం తహసీల్దార్ రాణి అమ్మాజీతో కలిసి మండలంలోని సర్పానది పరివాహక ప్రాంతాలైన కొండల అగ్రహారం, పోచినపెద్ది అగ్రహారం, మాకవరపాలెం గ్రామాల పరిధిలోగల ఇసుకరీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పరిశీలించిన రీచ్‌లు అన్ని వంతెనల సమీపంలో ఉండడంచేత అనుమతులు ఇవ్వడం కుదరదన్నారు. ప్రభు త్వం ఆదేశాలతో అందరికీ అందుబాటులో ఇసుక లభించేలా తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గనులశాఖ ఏడీ వెంకటరావు, జలవనరుల శాఖ డీఈ స్వామినాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయం సంయుక్త ఆధ్వర్యంలో
# అయ్యప్ప దీక్ష స్వాములకు అన్నప్రసాద వితరణ



విశాఖపట్నం : శ్రీ హరి హరాత్మజ అన్నదాన ఛారి టబుల్ ట్రస్ట్ శ్రీ కోదండ రామాలయం సంయుక్త ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష స్వాములకు నలభై ఒక్క రోజుల పాటు అన్న ప్రసాద వితరణ కార్య క్రమం నిర్వహించడం అభినందనీయమని డి ఆర్ ఎం చేతన్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు., రైల్వే కాలనీ వైర్లెస్ కాలనీలో శ్రీ రామాలయ దేవాలయంలో అయ్యప్ప స్వాము లకు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని డిఆర్ఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్ష ఉపాధ్యక్షులు కంచు వెంకటరమణమూర్తి, కోటేశ్వరరావులు మాట్లా డుతూ డిసెంబర్ ఎనిమిదో తేదీ వరకు 41 రోజుల పాటు ఈ అన్నప్రసాద వితరణ కార్య క్రమం జరుగుతుందన్నారు. సుచికరమైన, రుచి కరమైన మడితో వండిన అన్నప్రసాదాన్ని అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులతో పాటు ఏ మాల వేసిన భక్తులైన స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ కార్యదర్శి కోరాడ చిన్న అప్పారావు కడగల శ్రీను లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జలాశయాన్ని పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ



దేవరాపల్లి : మండలంలోని రైవాడ, ఇసుక గెడ్డ మినీ రిజర్వాయర్ ఇరిగేషన్ ఎస్ఈ కే. సూర్య కుమార్ పరిశీలిం చారు. ఆయన బాధ్య తలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రైవాడ జలాశయాన్ని, ఇసుక గెడ్డ మినీ రిజర్వాయర్ ప్రాంతాలను మంగళవారం పర్యటించారు. జలాశయం సామర్థ్యాన్ని వాటి స్థితిగతు లను ఇరిగేషన్ శాఖ అధికారు లను అడిగి తెలుసు కున్నారు. అనంతరం రైవాడ జలాశయాన్ని పరిశీలించిన ఆయన వరదల సమయంలో గేట్లు పని తీరుపై ఆరా తీశారు. ఏమైనా లోపాలు ఉంటే వెంటనే ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపా లన్నారు. ఆర్. శ్రీరామ కృష్ణ, డిఈఈ కే. మాధవి, గణపతి, అసి స్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అరుణ, జి. కార్తీక్, వి. సత్యప్రసాద్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 18,19 తేదీల్లో రాష్ట్ర స్థాయి వరకు వర్క్‌షాప్
### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన దొరబాబు



నర్సీపట్నం : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి వర్క్ షాపు నవంబర్ 18, 19 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన. దొరబాబు తెలిపారు. ఈ మేరకు నర్సీపట్నంలో కరపత్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ చేతుల మీదుగా విడుదల చేశారు. విశాఖపట్నంలో జరిగే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, మాజీ ఐఏఎస్ అధికారి ఈఏయస్ శర్మ, తది తరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంబంధమైన సమ స్యలు గ్రామీణ ఉపాధి హామీ పథకం తది తర సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## లక్కవరంలో ఈ నెల 31న
# ఎడ్లబండి పరుగు పోటీలు

చోడవరం : మండలంలోని లక్కవరం గ్రామంలో ఈ నెల 31 మధ్యాహ్నం ఎడ్లబండి పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు వెలమ వీధి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. నాగుల చవితి సందర్భంగా నిర్వహించే ఈ పోటీలలో విజేతలకు వరుసగా 8వేలు, 6వేలు, 4వేలు, 3 వేలు, 2వేలు, 1500,వెయ్యి రూపాయలు, 800 మొత్తం 8 నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పోటీలో పాల్గొనదలచిన వారు 100 రూపాయలు నామినేషన్ మధ్యాహ్నం 12 గంటలలోగా చెల్లించాలని తెలిపారు.

## 31వ వార్డు ప్రజా దర్బార్ వార్డులలో ప్రజాదర్బార్



విశాఖపట్నం : విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతీ మంగళవారం ఉదయం 8:00 గంల నుండి 9:30గం ల వరకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబడుతున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 15, 31, 44 వార్డులకు సంబంధించిన ప్రజల సమస్య లను తెలుసుకుని, వెంటనే పరిష్కరిం చాలని ఆకాంక్షతో ఏదైనా అత్యవసర సమస్య ఎదురైతే తక్షణమే సమస్యల వద్దకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను క్లియర్ చేస్తున్నారు. మంగళవారం క్రార్యక్రమం లో ప్రధా నంగా 15వవార్డు దొండపర్తిలో కమ్యూనిటీ హాల్‌ను సచివాలయానికి ఇవ్వాలని జివియంసి యుసిడి అధికారులు కమ్యూనిటీ హాల్ మేనేజ్ మెంట్‌తో మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ లో సుమారుగా 400 కుటుంబాలకు పైగా కమ్యూ నిటీ మీటింగ్స్, పేదవారు చిన్న చిన్న ఫంక్షన్స్ జరుగుతున్నాయి.

కావున ఎటువంటి ఇబ్బం దులు లేకుండా ఉండే ఏరియాలో సచి వాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి 15వ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, నాగేంద్ర, 44వ వార్డు ప్రెసిడెంట్ ఈరోతి చిన్న కుమార్, సత్యనారాయణ, లక్ష్మి శివప్రసాద్, కోటేశ్వర రెడ్డి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ఎదుట
# పంచాయితీ కార్మికుల ధర్నా



పెద్దాపురం : రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా రెండవ రోజు పెద్దాపురం ఎంపీ డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండ లంలో ఉన్న పంచా యితీ వర్కర్లు ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాను ఉద్దే శించి సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ పంచాయితీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీనే అమలు చేయక పోవడమే దీనికి నిదర్శనం అన్నారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలం టారని కానీ అలాంటి పట్టుకొమ్మలని కాచి కాపాడే పంచాయి కార్మి కుల జీవితాలు మాత్రం వెలుగులేకుండా పోయిందని అన్నారు. పంచాయితీలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను, పంచాయితీ కార్మికులను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాల్సిన భాద్యత ప్రభు త్వంపై ఉందని అన్నారు. కంపెనీలకు పిఎఫ్ ఇఎస్ఐ అమలు చెయ్యమని చెప్పే ప్రభుత్వాలు, ప్రభుత్వమే నిర్వహిస్తున్న పంచాయితీలల్లో ఎందుకు నిర్వ హించదని ప్రశ్నించారు.

సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరి బాబు సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వర్కర్స్ యూని యన్ నాయకులు వై.నరసింహం మూర్తి, రజాక్, మల్లేష్, చిట్టిబాబు, శివ, నాగేశ్వరరావు, పి.ప్రసాద్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలో శానిటేషన్‌పరులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
### డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషరాణి హెచ్చరిక



ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న డిఎల్‌పిఓ ఆర్.శిరీషరాణి

నర్సీపట్నం : పంచాయతీలో ప్రజలు ఇబ్బంది పడకుండా, అసౌకర్యంగా భావించ కుండా, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్ శిరీషారాణి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వేములపూడి పంచాయతీ ఆమె సందర్శించారు. ఇప్పటివరకు పంచాయతీలో సచివాలయంలో విధుల్లో చేరిన సచివాలయ ఉద్యోగులను ఆమె పరిచయం చేసుకొని దిశానిర్దేశం చేశారు. కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులు పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. పంచా యతీలో పారిశుద్ధ్య పనుల పై ఆమె పర్యటన చేశారు. అనంతరం పంచా యతీ పరిపాలనా ధికారి దేవాడ సంజీవరావుకి పలు సూచనలు చేశారు. త్రాగునీరు, పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించకపోతే ప్రజల నుండి అభాసుపాలు కావాల్సి వస్తుందని ఆమె వారికి విశదీకరించారు.

## విద్యార్థులకు ప్రాథమిక జ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలి
### జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి



భీమునిపట్నం: స్థానిక సెయింటాన్స్ పాటశాల లో మంగళవారం జరిగిన ఉపాద్యాయులు సమావేశానికి విశాఖ జిల్లా విద్యాశాఖ అదికారి బి.లింగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాదమిక పాటశాల లో విద్యార్థులకు అందించిన జ్ఞాన మే ఉన్నత పాఠశాలలో పునాదులు వేస్తాయని అందుకే ఇప్పటి నుంచి ప్రాదమిక జ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలని ఉపాద్యాయులకు సూచించారు. ఇటీవల జిల్లాకు విచ్చేసిన ఉన్నతాధికారుల తనిఖీ లో ప్రాదమిక పాఠశాలలో చదువుచున్న విద్యార్థుల్లో కొంచెం చదవడం, రాయడం తగ్గిం దని దానికోసం కొన్ని ప్రణాళికలు రూపొం దించాలని డిఐఓకి తెలిపారు.అలాగే ఒకటి ఐదు తరగతుల విద్యార్దులకు కొన్ని కొత్త పద్దతులు ద్వారా జ్ఞానాన్ని మేరుగు పరచాలని పరీక్షలు కన్నా, ర్యాంకుల కన్నా అవగాహన కలిపించడమే ముఖ్యమని తెలియజేశారు. అలాగే వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక తరగతులు నిర్వహిం చడం ద్వారా మరింత శ్రద్ధ తీసుకోవా లని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్య క్రమంలోఉప విద్యాశాఖాదికారి ప్రేమ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారిని కె. అమృత భాల మణి, నోడల్ హేచ్ బిఎంఎంలు పట్నాయక్, సి.హెచ్.సింహాచలం,మండలం లోని ప్రాధమిక, ప్రాధమికోన్నత ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# దేశంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం ...

నాలుగున్నర సంవత్సరాల కాలంలో 25 లక్షల మంది లబ్ధిదారులకు పక్క ఇళ్లు మంజురు చేస్తాం..
నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశం కల్పించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుంది..
ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ వర్గాలకు కూడా నామినేట్ పదవుల్లో , కాంట్రాక్టు లో కానీ 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అని చట్టం కూడా చేయడం జరిగింది.. కోటి నాలుగు లక్షల ఏభై ఐదు వేల వ్యయంతో ఉత్తర నియోజకవర్గం పరిది లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి .......





విశాఖపట్నం : రానున్న రోజుల్లో ఆంధ్ర రాష్ట్రాన్ని బారత దేశంలో అగ్రగామిగా నిలుపుతామని రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అన్నారు . ఈమేరకు కోటి నాలుగు లక్షల ఏభై ఐదు వేల వ్యయంతో ఉత్తర నియోజకవర్గం పరిది లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబందించి డి.ఎల్ .బి .మైదానంలో మంగళవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేసారు. అనంతరం వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త కేకే రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ వర్గాలకు కూడా నామినేట్ పదవుల్లో, కాంట్రాక్టు లో కానీ 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం కూడా రూపొందించడం జరిగిందన్నారు. అలాగే మహిళలకు అండగా ఉండేందుకు మహిళలకు 45 ఏళు నిండిన ఎస్సీ ఎస్టీ మైనారిటీ అక్క చెల్లెళ్లకు అందరికీ కూడా మరోసారి పథకాలను వర్తింప చేస్తామన్నారు .సమాజంలో దాదాపు 80 శాతం ఉన్నటువంటి ఆ వర్గాల ఆర్థిక రాజకీయ సామాజిక చరిత్ర మేలిమలుపు లు తిరిగి పొందడం సందేహమే లేదని అంతా ఉండే చెట్టు దాని కంటే మిన్నగా చెప్పిన గడువు కంటే ముందుగా రైతు చరిత్ర మారబోతోందన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఇంచుమించుగా 25 లక్షల మంది లబ్ది దారులకు పక్క ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని ఉద్యోగావకాశాలు ఎటువంటి చదువులు లభించే ఎటువంటి చదువులు నేర్పించడం కోర్సు కార్మికులంతా కూడా సమూలంగా మార్పులు చేర్పులు చేయడం కూడా జరుగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం అదికారం చేపట్టిన ఐదు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై రహస్య సర్వే నిర్వహించామని సర్వేలో ఇంచుమించుగా 75 శాతం మంది ప్రజలు ప్రభుత్వం పట్ల ప్రభుత్వ విధానాల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వం పట్ల పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ అవినీతిరహిత ప్రభుత్వం అవినీతికి తావు లేకుండా ప్రస్తుతం అటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాల్గున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు మాట్లడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన అభివృద్ధి పథంలో పయనిస్తోందని , ఆయన పై నమ్మకం తో రాష్ట్రంలో 151 మంది ఎమ్మెల్యే లను అందించిన రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ మన ముఖ్యమంత్రి అందరికీ భరోసా కల్పిస్తున్నారని , గత ప్రభుత్వంలో చంద్రబాబు అవినీతికి అంతు లేకుండా పోయిందని అందుకే వారి ఎంపీ లను కూడా బి జె పి లో కలిపి పరోక్షంగా వారికి సహకరించి ఈయన తప్పును కప్పిపుచ్చుకుశీటున్నారని, చంద్రబాబు ఒకప్పటి జాతీయ నాయకుడు కానీ ఇప్పుడు ఒక జాతికి చెందిన నాయకుడిగా మిగిలి పోయాడని విమర్శించారు., ఈ ప్రభుత్వం లో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతికి ఆస్కారం లేకుండా పాలిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త కేకే రాజు మాట్లడుతూ ఆడపడుచు కన్నీరు కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఒక బెల్ట్ షాపులు లేకుండ చర్యలు తీసుకున్నారనిఅన్నారు. అదే విధంగా దశలవారిగా మద్యపాన నిషేదం జరుగుతోందన్నారు.



నిరు పేదలు కన్న ఇంటి కళ నెరవేర్చడానికి రూ. 1.96ల ఇల్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని భాగంగా రెండువేల ఎకరాల భూ సేకరణ జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో 25లక్షల ఇళ్ళు ఇస్తే అంతకు రెట్టింపు జగనన్నచేసి తండ్రిని మించిన పాలనసాగిస్తాడని అన్నారు. ఈ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, శాసన సభ్యులు గుడివాడ అమరనాథ్, జి వి ఎం సి కమీషనర్ సృజన , జివిఎంసి జోన్ -4 కమిషనరు ఎస్ .సింహచలం వై కా పా నాయకులు చొక్కాకుల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ సంకల్పయాత్ర తగరపువలసలో ముగింపు




భీమునిపట్నం : జాతిపిత మహాత్మా గాంధీ 150 వ జయంతిని పురస్కరిం చుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన గాంధీ సంకల్ప యాత్ర లో భాగంగా ఎం.ఎల్.సి పి మాధవ్ విశాఖ జిల్లా పాయకరావుపేట నుండి భీమిలి వరకు పాదయాత్ర తలపెట్టారు. ఈ పాదయాత్ర లో భాగంగా చివరి రోజు 30 వ తేదీ ఉదయం పెద్దిపాలెం విలేజీ నుండి గొల్లల తాళ్లవలస మీదుగా భీమిలి చేరుకుని, మధ్యాహ్నం బాంక్ కాలనీ సద్గురు శివానంద ఆశ్రమం చేరు కుంటారు. అక్కడ మాజీ మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి, మాజీ ఎంపీ కె. హరి బాబు, జిల్లా బీజేపి ముఖ్య నాయకులు, కార్య కర్తలుతో కలసి చిట్టివలస బంటాట మైదా నంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని భీమిలి అర్బన్ బీజేపీ అధ్యక్షులు పంపాన శ్రీధర్ తెలిపారు.

ఈ కార్య క్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్ ఛార్జి ఉప్పాడ అప్పారావు, నియోజకవర్గ కన్వీనర్ కోరాడ అప్పారావు, ఎస్సి మోర్చా సిటీ వైస్ ప్రెసిడెంట్ కోడూరు సంజీవ రావు, నాయకులు జీరు సత్యనారాయణ, డాక్టర్ సత్తరవు వాయు నందనరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అచ్యుతాపురం : పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాడిమాండ్లని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయితీ కార్మికులు మండల కార్యలయం వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయితీ కార్మికులను గ్రామ సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 18 వేలు వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు ,పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సైన్సే మానవాళి అభివృద్ధికి మూలకారణం






**మొదటి పేజీ తరువాయి**

పాముల పుష్ప శ్రీవాణి తెలిపారు. మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మారికవలస గ్రామంలో మూడు రోజుల పాటు జరిగే గిరిజన గురుకుల రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను అమె ప్రారంభించారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ ప్రశ్నించడమే సైన్సుకు మూలమని, సైన్సే మానవాళి అభివృద్ధికి ప్రధాన కారణమని అన్నారు. విద్యార్థులు ప్రకృతిలోని ప్రతీ అంశాన్ని తరచి చూస్తూ ప్రశ్నించడం నేర్చుకోవడం ద్వారా గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడం మంచిదని అన్నారు. ప్రశ్నల కారణంగానే మానవాళి చరిత్రలో క్రొత్త ఆవిష్కరణలు జరుగుతాయని తెలిపారు. ఒకప్పుడు కొండ గుహల్లో అనాగరికంగా బ్రతికే స్థాయి నుంచి ఎన్నెన్నో క్రొత్త విషయాలు కనుగొని ఇప్పుడు చంద్ర మండలం చేరుకునే స్థాయికి చేరుకోవడానికి మనిషి తనకు తానే వేసుకున్న ప్రశ్నలే కారణమని అభిప్రాయ పడ్డారు. ఎన్నో విషయాలను కనుగొన్న మనుషులు మెదడులో దాగివున్న శక్తి విని యోగించగలి గిందని కేవలం 5 శాతమే మాత్రమేమని, 5 శాతా నికే మనిషి ఇంతగా ఎదిగితే ఇక మిగిలిన 95 శాతం శక్తిని కూడా వినియోగించుకుంటే ఈ ప్రపంచం ఎలా ఉంటు ందో ఒక సారి ఊహకు కూడా అందదని పేర్కొ న్నారు. ఒక క్రొత్త విషయాన్ని కనుగొ నేందుకు ప్రయత్నిస్తూ ఎన్ని సార్లు విఫలమైనా విజయం సాధించేవరకు ప్రయత్నాన్ని కొనసాగించాలని విద్యార్థులకు హితవు చెప్పారు. బట్టీ పట్టి పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలనుకోకుండా తెలియని విషయాలపై టీచర్లను ప్రశ్నించడం నేర్చుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టూరిజం శాఖామాత్యులు అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఫేర్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకంగా వుందని. సైన్స్ ఫేర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో విషయాలు తెలుసుకొని ముందుకు సాగాలని తెలిపారు. అరకు పార్లమెంటు సభ్యురాలు గొట్టేటి మాధవి మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో విషయాలు తెలుసుకొని ముందుకు సాగాలన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు సభ్యురాలు కె.భాగ్యలక్ష్మి, యం.ఎల్.సి.పాకలపాటి రఘు వర్మ తదితరులు గిరిజన గురుకుల రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురించి వివరించారు. పాడేరు ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్ అధికారి డి. కె.బాలాజీ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్, కన్వీనర్ అయిన డిప్యూటీ సెక్రటరీ ఎకాడమి ఎస్ . లక్ష్మణరావు , ఆర్గనాయిజింగ్ కమిటీ ఛైర్మెన్, గురుకుల జాయింట్ సెక్రటరీ కె.బాలాజీ నాయక్. చదువులో ప్రతిభ కనబరచిన ముగ్గురు విద్యార్థులకు లాప్ టాప్‌లను బహుకరించారు.

## విశాఖ డెయిరీ సిఈఓను మర్యాదపూర్వకంగా కలిసిన చోడిపల్లి



అచ్యుతాపురం : విశాఖ డెయిరీ సిఈఓ, వైసిపి జిల్లా నాయకులు ఆడారి ఆనంద్‌కుమార్‌ను మంగళవారం విశాఖ డెయిరీ వద్ద వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చోడిపల్లి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మా నించారు. ఆయనతో పాటు మేరుగు అప్పలరాజు, సూరాడ దేవుడు ఉన్నారు.

## గజపతినగరంలో ప్రారంభమైన అభయాంజనేయ కార్తీక మహొత్సవాలు



చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్స వాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా మంగళ వారం తెల్లవారు జాము నుంచి ఆలయం వద్ద కార్తీక జ్యోతులు వెలిగించి లింగా ష్టకం, శివపంచాక్షరీ స్తోత్రాలతో పాటు శివనామ జప కార్య క్రమం నిర్వహించారు. అనం తరం అభయాం జనేయ స్వామికి వనమాల, నిమ్మకాయలు, తమల పాకులతో అలంకరించి ఆంజనేయస్వామి మాలధారులచే విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్తీక మాసం నెల రోజులు స్వామి వారి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవంతో పాటు మధ్యాహ్నం అన్నదానం నిర్వహి స్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు కొణతాల మహేశ్వరరావు, దొడ్డిసాయి సూరి అప్పారావు, కాళ్ల శంకర్‌రావు తెలిపారు. భక్తులు పాల్గొన్నారు.

## నాబ్ నిర్వాసితుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి -సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం



విశాఖపట్నం : జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఎన్.ఎ.ఒ.బి అధి కారులు, ఎల్&టి, నవయుగ కంపెనీల యాజమాన్యాలు, నాబ్ నిర్వాసిత బంగారమ్మపాలెం గ్రామ మత్స్య కారులతో విశాఖ కలెక్టరేట్‌లో జాయింట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే వి.అనిత, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథంమాట్లాడుతూ బంగారమ్మపాలెం రేవులో ఎన్ఎఒబి వారు డ్రెడ్జింగ్ పనులు వేగవంతం చేయడంతో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళే దారికి మేటవేసిందని, దీని కారణంగా 2 నెలలుగా మత్స్యకారులు వేట కోల్పోయారని, వేట కోల్పోయిన రోజులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వెంటనే నాబ్ అధికారులు మేట వేసిన చోట 200 మీటర్లు వెడల్పు, 10 మీటర్లు లోతు డ్రెడ్జింగ్ చేసి బంగారమ్మపాలెం మత్స్యకారుల వేటకు అనువుగా సముంద్రంలోకి మార్గం చూపాలన్నారు.

# ఆదిత్యలో విజ్ఞానదాయకంగా ముగిసిన ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల నందు గత 15 రోజులుగా నిర్వహించిన ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.కె. రామకృష్ణారావు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యఅభివృద్ధి శిక్షణా సంస్థ వారు సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యశాలకు సి.ఎస్.ఇ,ఐ.టి, ఇ.సి.ఇ, మరియు ఇఇఇ విభాగాలకు చెందిన30మంది ఫాకల్టీ సిబ్బంది పాల్గొన్నారని డా.రామకృష్ణారావు తెలిపారు.

ప్రాబ్లెమ్ సాల్వింగ్ యూజింగ్ పైథాన్ అండ్ మెషిన్లెర్నింగ్ అనే అంశం పై 5రోజుల కార్యశాల ఎంతో ఫలవంతంగా జరిగిందని,ఈ కార్యక్రమం ద్వారా నూతన విధానాలను తెలుసుకోవడం జరిగిందని,ఈ విషయ పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయుటకు ఎంతో ఉపయోగ పడుతుందని ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రో.ఏ.రామకృష్ణ, అసోసియేట్ ప్రాజెక్టైరెక్టర్ ఎ.రవికుమార్, ఆంధ్రప్రద రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థ ప్రతినిధులు, సి.ఎస్.ఇ, ఐ.టి, ఇ.ఇ.ఇ, మరియుఎలక్ట్రానిక్స్%అ% కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగఅధిపతులు, ఉపాధ్యాయ సిబ్బందిపాల్గొన్నారు.

# జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు పెంచాలి




కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి కూడా రూ.16వేల వేతనం పెంచి ఇవ్వాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

ఈమేరకు కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎన్.అనిల్ కుమార్,అధ్యక్షుడు కె.రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.16 వేలకు పెంచి ఇస్తున్నారని,తమకు కూడా వేతనాలు పెంచాలని కోరారు.

జీజీహెచ్ శానిటేషన్ కాంట్రాక్టర్లు నెలల తరబడి వేతనాలు బకాయిలు చెల్లించాలని,వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అధికసంఖ్యలో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల బస్‌కు ప్రమాదం

## మానవత్వం చాటిన మంత్రి కన్నబాబు



కాకినాడ : కాకినాడ రావులపాలెం రోడ్‌లో మంగళవారం పాఠశాల బస్‌కు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో విద్యార్థులు ఎవరికీ ప్రమాదం జరుగలేదు.

కానీ జరిగిన ఘటనతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. కాకినాడ శ్రీచైతన్య పాఠశాల చెందిన బస్ విద్యార్థులతో నగరంలోనికి ప్రవేశం చేస్తుండగా తూరంగి గ్రామం బైపాస్ వంతెన వద్ద పాఠశాల బస్ అదుపు తప్పి బడ్డీని ఢీకొట్టింది.ఘటనలో డ్రైవర్, క్లినర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

అదే సమయంలో సంఘటన ప్రాంతం మీదుగా పశ్చిమగోదావరి జిల్లా పర్యటనకు వెడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు వెంటనే తన కాన్వాయ్ ఆపించి స్వయంగా సహాయక చర్యలు చేపట్టారు.విద్యార్థులను ఓదార్చి పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి మరో బస్ ద్వారా వారిని పాఠశాలకు పంపారు. మంత్రి ఇచ్చిన సమాచారం మేరకు కరప ఎస్సై డి.రామారావు జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# కార్తీక శోభ సంతరించుకున్న శివాలయాలు



రావులపాలెం: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మొదటి రోజు మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుఝామునే భక్తులు నదీ స్నానమాచరించి శివుని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భముగా శివాలయాలన్నీ హరహర నమహశ్శివాయ అను నామంతో మార్మోగాయి. అన్ని మాసాలకన్నా కార్తీక మాసాన్ని హిందువులు అతి పవిత్రమాసంగా భావిస్తారని, కార్తీక మాసం ఆదిదేవుడు శివునికి అత్యంత ప్రీతికరమైన మాసమని, మండలంలోని ఆలయాలన్నీ ప్రత్యేక విద్యుద్దీప అలంకరణతో దేదీప్యమానంగా తయారుచేసారు. భక్తులు స్వామిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని పురాత శివాలయం, శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయ అర్చకులు బంగారు బాబు శర్మ తెలిపారు. కార్తీక మాసం ప్రారంభ రోజు సందర్భముగా అన్ని ఆలయాల్లో భక్తులు విశిష్టంగా పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భముగా ఆలయంలో తెల్లవారుఝామునుండే విశేష అభిషేకములు, అర్చనలు నిర్వహించారు. శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదని స్వామి, అమ్మవారల్లను దర్శించుకొని కార్తీక దామోదరున్ని పూజించి ముక్తిని పొందాలని అర్చకులు బంగారుబాబు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో విశేషంగా భక్తులు పాల్గొనగా శ్రీనివాస శర్మ, రాంబాబు శర్మ, సాయి శర్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# నేడు మెగా జాబ్‌మేళా



అమలాపురం: చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ మరియు వికాస ఆధ్వర్యంలో, శ్రీమతి చింతా అనురాధ పార్లమెంట్ సభ్యులు అమలాపురం నియోజకవర్గం వారి సహకారంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా అక్టోబర్ 30వ తేదీ బుధవారం భట్లపాలెం, అమలాపురం బి.వి.సి ఇంజనీరింగ్ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 2500 ఉద్యోగాలతో 44 ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొననున్నాయి. ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బి.టెక్ మరియు పి.జి చదివిన 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు అభ్యర్థులందరూ అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు నియామక పత్రాలు అందజేశారని ఎంపి తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులందరూ అక్టోబర్ 30 వ తేదీ బుధవారం తమ బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్ కాపీలు మరియు http://vikasajobs.com/amp-jobmela.php లింకు ద్వారా రిజిస్టర్ చేసుకొని రిజిస్ట్రేషన్ కాపీతో అమలాపురం భట్లపాలెం, అమలాపురం బి.వి.సి ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద ఉదయం 8 గంటలకు హాజరు కావలన్నారు. పూర్తి వివరాలకు www.vikasajobs.com చూడాలన్నారు. మరిన్ని వివరాలకు 0884 2352763 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థుల వినతి మేరకు జాబ్ మేళా రోజున స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించబడిందని, ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ కాని అభ్యర్థులు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు ఎంపి అనూరాధ తెలియజేశారు.

# 31 విజయవాడ సభ జయప్రదం చేయండి

## ఇసుక ర్యాంపులను తక్షణమే ప్రారంభించాలి

## ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలి




కాకినాడ: అక్టోబర్ 31 విజయవాడలో జరిగే సామూహిక రాయబార సభకు భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా తరలివచ్చి డిమాండ్లు సాధించుకోవాలని సిఐటియు పిలుపునిచ్చింది.గత ఐదు నెలలుగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనులు కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేలు జీవన భృతి చెల్లించాలని,పర్యావరణ అనుమతులు ఉన్న 251 ఇసుక ర్యాంపులను తక్షణమే ప్రారంభించాలని,ఆన్ లైన్ విధానంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని, కోరుతూ ఈ నెల అక్టోబర్ 31 ఉదయం 10గంటలకు విజయవాడ అలంకార్ సెంటర్లో జరిగే సామూహిక రాయబార సభకు భవన నిర్మాణ కార్మికుల జిల్లా నుండి వేలాదిగా తరలివచ్చి డిమాండ్లు సాధించుకోవాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు,చెక్కల రాజకుమార్ లు పత్రికా ప్రకటన విడుదల చేశారు.కాకినాడ కలెక్టరేట్ వద్ద వినూత్న పద్ధతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీ పేరుతో నిర్మాణ పనులు అత్యధికంగా జరిగే మే ,జూన్ ,జూలై నెలలో పాత విధానాన్ని నిలుపుదల చేస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడంతో సీజన్ లో అత్యధికంగా జరిగే పనులన్నీ కార్మికులు కోల్పోవాల్సి వచ్చిందని, నూతన పాలసీ సెప్టెంబర్ 5 నుండి ప్రారంభం అయిన తరువాత వరదల పేరుతో మరో రెండు నెలలు ఉన్న ఆ కాస్త పనులు కూడా పోవడంతో పిల్లలను చదివించుకోలేక, తల్లిదండ్రులకు వైద్యం చేయించలేక, కుటుంబాలను పోషించలేక ఇప్పటికీ రాష్ట్రంలో 10 మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వీరి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే ఇసుకపై కృత్రిమ కొరత సృష్టిస్తుందని అందుకే అనుమతులు 251 ర్యాంపులలో కేవలం 41 ర్యాంపులలో మాత్రమే ఇసుకను తవ్వి తీస్తుందని విమర్శించారు.తక్షణమే అన్ని ర్యాంపులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించినట్లు రోజుకు రెండు లక్షల టన్నుల ఇసుక అమ్మకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి రోజు 80 కోట్ల ఆదాయం వస్తుంటే,40 రోజుల ఇసుక ఆదాయాన్ని భవన నిర్మాణ కార్మికులకు ప్రతి ఒక్కరికి 10వేలు చెల్లించడానికి సరిపోతుందని తెలిపారు.ఆన్ లైన్ ఎప్పుడు ప్రారంభం ప్రభుత్వ మంత్రులకు, ఎమ్మెల్యేలకు,వారి వద్దఉండే పెద్దమనుషులకు ముందస్తు సమాచారం ఆధారంగా ఆన్ లైన్ అమ్మకాలు ప్రారంభించిన పది నిమిషాల్లోనే అవుట్ ఆఫ్ స్టాక్ అవుతుందని,ఆన్ లైన్‌లో దొరికిన ఇసుకను ఈ పెద్ద మనుషులే బహిరంగ మార్కెట్లో అధిక ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు.

కావున ఇసుక అక్రమాలకు నివారించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లయితే అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఇసుక నిలుపుదల చేయాలని, అందుకు రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఇసుక కలిగే అవకాశం ఉందని తెలిపారు.

# క్రైస్తవుల అభివృద్దే ధ్యేయంగా వైసిపి



రావులపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి క్రైస్తవుల పట్ల అత్యున్నత అభిమానంతో చర్చిల నిర్మాణం, క్రైస్తవుల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నారని రాష్ట్ర పియుసి చైర్మన్, శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి లక్ష్మిపోలవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన బేతేలు ప్రార్ధనా మందిరం ప్రతిష్టారాధన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, బైబిల్ మిషన్ ప్రముఖులు అద్భుత కుమార్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భముగా నూతనంగా నిర్మించిన ప్రార్ధనా మందిరానికి క్రైస్తవ ఆచారం ప్రకారం ప్రముఖ ప్రార్ధనలు నిర్వహించి ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో క్రైస్తవుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి అవిశ్రాంతం కృషి చేస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జిల్లా పరిషత్ ప్రతిపక్ష మాజీ నేత సాకా ప్రసన్నకుమార్, ఎమ్‌పిడిఓ జి. రాజేంద్ర ప్రసాద్, వైసిపి నాయకులు హనుమంతవత్సల రాంపండు, పులుగుర్త రామారావు, కప్పల నాగేశ్వరరావు, దంగేటి మాణిక్యాలరావు, దంగేటి ప్రకాశరావు, వెలిగేటి వెంకటేశ్వరరావు, సాటి అన్నవరం, అత్తిలి సుగుణరాజు, కొండేటి సత్యనారాయణ కుసుమే రాజ్‌కుమార్, పాస్టర్ రెవ శాంతారావు, సుందరలాల్, సంఘ ప్రతినిధులు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు యూనిఫాంల పంపిణీ

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్ధానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళవారం ఉదయం 6,7,8 తరగతులు చదువుచున్న 87 మంది విద్యార్థిని,విద్యార్థులకు ఒక జత చొప్పున ప్రభుత్వం వారు అందించిన యూనిఫాం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ బోడపాటి.తిరుపతి రావు చేతులు మీదుగా పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రెసిడెంట్,కాకినాడ వైసీపీ ఎస్సీ సెల్ పార్లమెంటరీ విభాగం అధ్యక్షుడు శెట్టిబత్తుల.కుమార్ రాజా,పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మెన్ శ్రీమతి లోవతల్లి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిశెట్టి.సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు శర్మ,రవి మాష్టారు,ప్రసాద్,సతీష్,రమేష్, శారద, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగినీ హస్త భోజన కార్యక్రమం



రావులపాలెం: కార్తీక మాసంలో భగినీ హస్త భోజనాలు అతి పవిత్రమైనవని ప్రపంచంలో అతి మధురమైనది, పవిత్రమైనది బంధం అని సోదర సోదరీలదని బ్రహ్మకుమారి భవాని అన్నారు. రావులపాలెంలో ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం సంస్థ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భముగా భగిని హస్త భోజనాలను ఏర్పాటు చేసారు. ఈ సంర్భముగా సంస్థ నిర్వాహకురాలు భవాని మాట్లాడుతూ భగిని హస్త భోజనం అంటే ప్రపంచంలోనే ఎంతో పవిత్రమైనదని తెలిపారు. అనంతరం సామూహిక భగినీ హస్త భోజన కార్యక్రమం నిర్వహించారు. అమ్మలో మొదటి అక్షరం, నాన్నలో చివరి అక్షరం కలిస్తే వచ్చేదే అన్న అని, చెలిమిలో మొదటి అక్షరం, చెల్లిలో చివరి అక్షరం కలిస్తే వచ్చేదే చెల్లి అని అంతటి అనుబంధం గూర్చి ప్రత్యేకంగా చెప్పేదే కార్తీక విదియ రోజు అని అందుకే ఈ రోజును అన్నా చెల్లెల్ల రోజు అని పిలుస్తారని పెడసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని తెలిపారు. ఈ రోజును యమ విధియ అని, యమధర్మరాజు చెల్లెలు యమునాదేవి ఆహ్వానం మేరకు అన్నయ్య అనుకున్న సమయానికి చెల్లెలి ఇంటికి రాలేక కార్తీక విదియ రోజున వచ్చి సోదరి చేతి వంట తిని వరం కోరుకోమనగా నిరంతరం ధర్మసృష్టి కార్యంలో మునిగి తేలుతూ ఉండే నీవు మా ఇంటికి రావడం చాలా ఆనందదాయకం ఇలా ప్రతి ఏటా మా ఇంటికి వచ్చి ఆతిద్యం స్వీకరించి వెళ్ళాలని కోరిందని, అప్పటినుండి తోబుట్టువు ఇంటికి వెళ్ళి భోజనం చేసే అలవాటుగా ఆనాటినుండి ఆనవాయితీగా వస్తుందని ఈ రోజననే భగినీ హస్త భోజనంగా పిలుస్తారని అవధాని తెలిపారు. పూర్వం నుండి ఆర్యవైశ్యులు మాత్రమే చేసుకొనుచుండగా ప్రస్తుత కాలంలో అందరూ ఈ ఆచారాన్ని పాటించడం ఆనందదాయకమని, ఈ అనాదిగా వస్తున్న ఆచారాన్ని ఈ విధంగా అందరూ కొనసాగించాలని మన్యం పర్వత వర్ధనరావు తెలిపారు.

# పోలీసులను చెట్టుకు కట్టేసి కొట్టిన గ్రామస్తులు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో ఘోరం జరిగింది. నేరస్తులను అరెస్ట్ చేయడానికి వెళ్లిన పోలీసులను చెట్టుకు కట్టేసి కొట్టారు కొంతమంది దుర్మార్గులు. వదిలేయాలని పోలీసులు బతిమాలుతున్నా వినకుండా దాడి చేశారు. ఈ దారుణ ఘటన వారణాసి నగరంలోని హార్సోస్ గ్రామంలో చోటు చేసుకుంది. రాజన్ భరద్వాజ్, రాహుల్ అనే నేరస్తులు హార్సోస్ గ్రామానికి వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు ఆ గ్రామానికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన రాహుల్ అక్కడి నుంచి పారిపోయాడు. రాజన్ భరద్వాజ్ పోలీసులకు దొరికిపోయాడు. రాజన్ భరద్వాజ్‌ను కారులో ఎక్కించుకుని వెళ్తుండగా, క్రిమినల్స్‌కు చెందిన అనుచరులు, కొందరు గ్రామస్తులు పోలీసులకు అడ్డుపడ్డారు. బైక్ మీద వెళ్తున్న పోలీసులను పట్టుకుని కొట్టారు. రాళ్లతో దాడి చేశారు. అనంతరం గ్రామంలోని ఓ చెట్టుకు వారిని కట్టేశారు. తమను వదిలేయాలని పోలీసులు బతిమాలుతున్నా వినకుండా దాడి చేశారు. అనంతరం పోలీస్ అధికారుల వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను కూడా లూటీ చేసి పారిపోయారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్-ఎస్పీ అదనపు బలగాలతో వెళ్లి గ్రామస్తులను చెదరగొట్టారు. పోలీసులను రక్షించారు. ఈ ఘటన కు సంబంధించి సుమారు 12 మందికి పైగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. రాజన్ భరద్వాజ్, రాహుల్ బంధువుల ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.

# ఫుట్‌బాల్ ఆటతో మెదడుకు జబ్బులు

న్యూఢిల్లీ : సాకర్‌గా పిలిచే ఫుట్‌బాల్ ఆట పట్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్రేజీ ఉన్న విషయం తెల్సిందే. అందుకు కారణం ప్రత్యర్థి పద్మ వ్యూహాలను తప్పించుకుంటూ క్రీడాకారులు ఫుట్‌బాల్‌ను పాదాలతో, మోకాళ్లతో గోల్‌వైపు తీసుకెళ్లి కాళ్లతోనో, తలతోనో గోల్ చేయడం ఉత్కంఠను రేపుతుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'పీలే' లాగే వెనుతిరిగి రివర్స్ కిక్ కొడితే ఉత్సాహం రెండింతలు అవుతుంది. ఫుట్‌బాల్ క్రీడకు సంబంధించి ఓ ప్రమాదకరమైన విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

క్రీడాకారులు తలతో ఫుట్‌బాల్‌ను కొట్టడం వల్ల సామాన్యులకన్నా మూడున్నర రెట్లు ఎక్కువగా మెదడు జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అమెరికా ఫుట్‌బాలర్లపైన అధ్యయనం జరిపిన ప్రముఖ డాక్టర్ బెన్నెట్ ఒమలు కనుగొన్నారు. అందుకని ఫుట్ బాల్ క్రీడలో తలతో బాల్‌ను కొట్టడాన్ని నిషేధించాలని, అది సాధ్యం కాకపోతే కనీసం 18 లోపు పిల్లలు అలా చేయకుండా నిబంధన విధించాలని ఆయన ప్రపంచ క్రీడాధికారులకు పిలుపు ఇచ్చారు. క్రీడల్లో రాణించడం కోసం చిన్న పిల్లలప్పటి నుంచి ఫుడ్‌బాల్ నేర్పిస్తున్నారని, అందులో భాగంగా వారు తలతో బాల్‌ను కొడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు మెదడు సంపూర్ణంగా అభివ ృద్ధి చెందదని, ఫుట్‌బాల్ దెబ్బల వల్ల వారిలో మెదడు అభివ ృద్ధి మందగిస్తుందని ఆయన హెచ్చరించారు.

తలవొంచి బాల్‌ను కొట్టినప్పుడల్లా మెదడుకు కనిపించనంత సూక్ష్మ స్థాయిలో గాయం అవుతుందని, ఊహాత్మకంగా చెప్పడం లేదని సైంటిఫిక్‌గా చెబుతున్నానని ఆయన తెలిపారు.

ఫుట్‌బాల్‌ను కొట్టేటప్పుడు తల అటూ ఇటు తిప్పుతారని, అప్పుడు కపాలం లోపల మెదటు అటూ ఇటూ ఊగుతుందని, ఫుట్‌బాల్ తగిలినప్పుడల్లా మెదడుకు ఒక చోట కాకుండా పలు చోట్ల గాయాలు అయ్యే ప్రమాదం ఉందని, తొలుత దీని ప్రభావం పెద్దగా కనిపించక పోవచ్చని, గాయాలు పెరిగినప్పుడు, వయస్సు మీరినప్పుడు మెదడుకు సంబంధించిన సమస్యలు వేధిస్తాయని ఆయన చెప్పారు.




## భారతీయ పునర్ వైభవ పర్వదినం
# శ్రీచరణుల జన్మదినం

- భక్తకోటి పర్వదినంగా శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి జన్మదినోత్సవం
- 31న విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి పుట్టినరోజు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు
- సభక్తికంగా పూజలు, అంబరాన్ని తాకే సంబరాలు
- పీఠం కేంద్రంగా దేశమంతటా సేవా కార్యక్రమాలు
- శ్రీ శారదాపీఠంలో విశేష అభిషేకాలు, అర్చనలు
- వేలాదిగా తరలి వచ్చే భక్తులకు స్వామిజీ దివ్య ఆశీస్సులు
- పత్రికా ప్రతినిధుల సమావేశంలో పీఠం ప్రతినిధుల వెల్లడి
- ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి



పెందుర్తి: స్వధర్మ సంరక్షణే ఊపిరిగా సాగిపోతూ భారతీయ సనాతన సంస్కృతిని పరిరక్షిస్తున్న జగద్గురు శంకరాచార్య సంప్రదాయ విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి జన్మదినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా ఈ నెల 31 (నాగులచవితి)న నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరమహంస పరివ్రాజకులు, అపరశంకరులు అయిన శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి పుట్టినరోజు పర్వదినాన్ని భారతీయ ధర్మపరిరక్షణ దినోత్సవంగా నిర్వహించాలని శ్రీ శారదాపీఠం ఆధ్వర్యాన అశేష భక్త జనావళి నిర్ణయించిందని ఉత్తర పీఠాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహా స్వామి పేర్కొన్నారు.. ఈ సందర్భంగా భక్తి, జ్ఞాన మార్గాలను ప్రబోధించే ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టింది. దాంతోపాటుగా సేవా కార్యక్రమాల నిర్వహణకు వ్యూహరచన చేసింది. పీఠం కేంద్రమైన చినముషిడివాడ నుండి దేశరాజధాని ఢిల్లీ వరకూ ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. హిందుత్వం విశ్వజనీనమైనదని, భారతీయులు ధర్మపరులని చాటి చెప్పే విధంగా ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకొంటున్నాయి. విశాఖ, హైదరాబాద్, ఢిల్లీ ఇంకా అనేక ప్రాంతాల్లో పీఠం సూచనలతో ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన, వస్త్ర వితరణ పెద్ద ఎత్తున చేపడతారు. స్వామి పుట్టినరోజున ఎక్కడికక్కడగా వివిధ సేవలను భక్తజనం ఒక వైపు నిర్వహిస్తుండగానే, మరోవైపు పీఠంలోనూ భారీఎత్తున పూజాదికాలు జరుగుతాయి. స్వామీజీ జన్మదినోత్సవాన్ని భారతీయ పునర్ వైభవ పర్వదినంగా జరపాలన్నదే భక్తుల లక్ష్యం. ఈ సందర్భంగా విశాఖ శ్రీ శారదాపీఠంలో ఈ నెల 31న జగద్గురు జన్మదినోత్సవ సంబరాలు అంబరాన్ని తాకుతాయి. ఆ రోజు ఉదయం ఎనిమిదింటికి శారదాపీఠంలో శ్రీ మహాగణపతిపూజ, పుణ్యాహవచనం జరుగుతాయి. తొమ్మిదింటికి షణ్ముఖ శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేకం చేస్తారు. అనంతరం రుద్రక్రమార్చన, అవాహంతీ హెూమం, ఆయుష్య సమం జరుపుతారు. ఆ తర్వాత పాదపూజ, భిక్షావందనం నిర్వహిస్తారు. పదకొండు గంటలకు పూర్ణాహుతి పూర్తవుతుంది. సాయంత్రం నాలుగింటికి సామూహిక లలిత, విష్ణు సహస్ర నామపారాయణం భక్తి శ్రద్ధలతో సాగిస్తారు.

**వస్త్రవితరణ**

స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ శారదాపీఠంలో ఆ రోజు సాయంత్రం పేద మహిళలకు వస్త్ర వితరణగా చీరలు అందజేస్తారు. అలాగే స్వామి పుట్టినరోజు ఉత్సవాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు మధ్యాహ్న భోజనంగా పీఠం సమీపంలోని పోర్టు కళ్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ జరుగుతుంది.

విశాఖ శ్రీ శారదాపీఠం, శ్రీ శారదాపీఠం ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నాయి. శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వీటిని పర్యవేక్షిస్తున్నారు. స్వామిజీ పుట్టిన రోజు వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు భాగం పంచుకుంటాన్నారని శ్రీ శారదాపీఠం ట్రస్టీలు తెలియజేసారు. సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులు, నగర పెద్దలు విశేష సంఖ్యలో భక్తులు ఉత్సవానికి తరలివస్తారని, వారికి స్వామివారి మంగళాశాసనాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం ట్రస్టీలు రొబ్బి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, వ్యాపారవేత్తలు భరత్ రెడ్డి, దరువు యం.డి కరణ్ రెడ్డి మరియు చొక్కాకుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నహుండీ లెక్కింపు

### 1 కోటి 22 లక్షల 26 వేల ఆదాయం



సింహాచలం: శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి వారి హుండీ లెక్కింపు మంగళవారం దేవస్థానం అధికారులు చేపట్టారు భక్తులు 34 రోజులుకు 1 కోటి 22 లక్షల 26 వేల ఆదాయం నగదురూపంలో చేకూరగా బంగారం 0.112. 900 గ్రాములు వెండి 10.900.000 కేజీలు విదేశీ కరెన్సీ యూఎస్ఏ 79 డాలర్లు, కెనడా 20 డాలర్లు, అస్ట్రేలియా 70 డాలర్లు, సింగపూర్ 20 డాలర్లు, ఇంగ్లాండ్ 10 డాలర్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఖతార్ 100 రియాధ్, బ్యాంక్ అఫ్ మలేషియా 27 అర్ఎం, ఒమన్ 2 రియాద్స్ చేకూరాయి. ఈ లెక్కింపు కార్యక్రమం దేవస్థాన ఈ ఓ ఎం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

# ఇసుక వారోత్సవాలకు జగన్ నిర్ణయం



తాడేపల్లి : స్పందన కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఇసుక తవ్వకాలు, పంపిణీపై సమీక్ష నిర్వహించిన సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇసుక వారోత్సవాలను నిర్వహిద్దామని ఆయన నిర్ణయించారు. వారం రోజులపాటు ఇసుక మీదే పనిచేసి.. ఇసుక కొరత గురించి మళ్లీ ఎవరూ మాట్లాడకుండా చూద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష పార్టీ నేతలు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మాట్లాడుతూ.. పళ్లు ఇచ్చే చెట్టుపైనే రాళ్లు వేస్తున్నారు. గతంలో వ్యవస్థ తీవ్ర అవినీతి మయం అయింది. దీన్ని పూర్తిగా రిపేర్ చేస్తున్నాం. ఎక్కడైనా అక్రమాలు జరిగితే అడ్డుకోవాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించాం. ఇసుక తవ్వకాలను అవినీతికి దూరంగా పెట్టగలిగామని గర్వంగా చెప్పగలం. గతంలో ఎప్పుడూ లేని విధంగా వర్షాలు, వరదలు వస్తున్నాయి. వర్షాలు కురవడం రైతులకు మంచిదే. దోచేసిన ఇసుక స్థానంలో కొత్త ఇసుక వచ్చి చేరడం కూడా మంచిదే. కానీ, రాబందుల మాదిరిగా మనపై రాళ్లు వేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ అనవసర ఆరోపణలు చేస్తోంది. వరదల వల్ల ఇసుక ఆశించిన స్థాయిలో తీయలేకపోతున్నాం. వచ్చే వారానికి వరదలు తగ్గుతాయని భావిస్తున్నాం. ఇసుక వారోత్సవం అని కార్యక్రమం పెడతాం. వారం రోజులు ఇసుక మీదే పనిచేద్దాం. ఇసుక గురించి మళ్లీ ఎవరూ మాట్లాడకుండా చూద్దాం. వచ్చే వారం రోజుల్లో పరిస్థితులు మెరుగవుతాయి అని సీఎం అన్నారు.

**70 చోట్ల ఇసుక రీచ్‌లు గుర్తింపు..**

ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఇసుక వెళ్లకూడదు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల వద్ద గట్టి పహారా ఉండాలి. డీజీపీ స్వయంగా దీనిని పర్యవేక్షించాలి. ఎంత బాగా పనిచేసినా మనపై విమర్శలు వస్తూనే ఉంటాయి. అందుకే మనం వెంటనే స్పందించాల్సిన అవరసరం ఉంది. భవన నిర్మాణ కార్మికులకు ఇప్పుడు పని దొరకడం లేదన్నది సరికాదు. గతంలో అవినీతి , మాఫియాతో ఇసుకను తరలించేవారు. ఇప్పుడు ప్రభుత్వం అధీనంలోనే ఇసుక రవాణా జరుగుతుంది. మరింతగా కార్మికులకు పనులు లభిస్తాయి. పట్టాభూములున్న రీచ్‌ల్లో తప్ప మిగతా చోట్ల మాన్యవల్‌గా ఇసుక తీయాలని చెప్పాం. వరదలు తగ్గేలోగా వాగులు, వంకల్లో 70 చోట్ల రీచ్‌లను గుర్తించారుఅని సీఎం చెప్పారు.

**20 కి.మీ. వరకు ట్రాక్టర్ల ద్వారా రవాణా**

గ్రామ సచివాలయాల్లో ఎవరైనా చలానా కట్టి 20 కి.మీ వరకు ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలించవచ్చు. పనులు కావాల్సిన కార్మికులు గ్రామ సచివాలయం ద్వారా ఇసుక రీచ్‌ల్లో పనులు చేసుకోవచ్చు. వరదలు తగ్గగానే రీచ్‌ల్లో ఎవరు పనులు అడిగినా ఇవ్వాలి. ప్రభుత్వం అధినంలోనే ఇసుక రవాణా జరుగుతుంది కాబట్టి.. పేదలకు మరింత మంచే జరుగుతుంది. ప్రతిపక్షం కావాలనే దుష్ప్రచారం చేస్తోంది. కౌలు రైతులకు సాయం చేశాం.. వారికి మరిన్ని పనులు కల్పించే అవకాశం ఉంటుంది. వరదల కారణంగా 267 రీచ్‌లకు 69 చోట్ల మాత్రమే ఇసుక తీస్తున్నారు. నవంబర్ వరకు వరదలు తగ్గుతాయి. ఇసుక అందుబాటులోకి వస్తుందిఅని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### టీటీడీ బంపర్ ఆఫర్!
# వయోవృద్ధులు, దివ్యాంగులకు దర్శనభాగ్యం



చిత్తూరు (తిరుమల): వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వీరికి టీటీడి ప్రత్యేకదర్శనం కల్పిస్తోంది. 4వేల టోకెన్లను ప్రత్యేకంగా వీరి కోసం కేటాయించినట్లు టీటీడి తెలిపింది. ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2వేల టోకెన్లు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లను టీటీడీ జారీ చేస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు రద్దీ రోజుల్లో తిరుమలకు వచ్చి ఇబ్బందులు పడకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడి శ్రీవారి భక్తులను కోరింది.

ఎస్వీ మ్యూజియం ఎదురుగా గల కౌంటర్ల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు ప్రతిరోజూ 1400 టోకెన్లు జారీ చేస్తున్నట్లు టీటీడి తెలిపింది. ఉదయం 7 గంటల నుండి ప్రారంభించి రెండు స్లాట్లకు సంబంధించిన టికెట్లు ఇస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 5 సంవత్సరాల లోపు చంటి పిల్లలను, వారి తల్లిదండ్రులను సుపథం మార్గం ద్వారా స్వామి వారి దర్శనానికి అనుమతించనున్నారు.సాధారణ రోజుల్లో ఒక సంవత్సరం లోపు చంటి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు సుపథం మార్గం ద్వారా దర్శనభాగ్యం కల్పిస్తారు.

# మంత్రి జిల్లా పర్యటన
## పలు పనులకు శంకుస్థాపన



విజయవాడ : విజయవాడలోని భవానిపురంలో ఈ నెల 26, 27, 28 తేదిల్లో దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సీటిలోని రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సకాలంలో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వం విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పనులన్నింటిని త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం : సీఎం జగన్

### విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి కీలక నిర్ణయాలు

అమరావతి : విద్యారంగంలో సంస్కరణలపై ఏర్పాటైన కమిటీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.బాలకృష్ణన్ తమ సిఫార్సులను సీఎం జగన్‌కు వివరించారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యపై కమిటీ సిఫార్సులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సిఫార్సుల్లో కూడా కమిటీ భాగస్వామ్యం కావాలని అన్నారు. రూ.5 కోట్ల ఖర్చుతో 1200 మంది టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది 1 నుంచి 8వ తరగతి వరకూ ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడుతున్నాం. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టీచర్లు ఉండేలా చూడాలి. టీచర్లకు సరైన శిక్షణ ఇవ్వాలి. 45 వేల స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నాం. స్కూళ్లలో ప్రారంభించిన నాడు నేడు కార్యక్రమం కొనసాగాలి. పిల్లలకోసం ఏర్పాటు చేసే ఫర్నీచర్ క్వాలిటీ విషయంలో రాజీ పడొద్దు. పాఠ్యప్రణాళిక చాలా బలోపేతంగా ఉండాలిఅని సీఎం అన్నారు.

ఉపాధి లేక ఉద్యోగం కల్పించాలి..

ప్రై%వేటు పాఠశాలలు ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రై%వేటు స్కూళ్లలో ఉన్న నాణ్యత, ప్రమాణాలను కూడా పరిశీలించాలి. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో క్వాలిటీని పరిశీలించాలి, పర్యవేక్షించాలి. అగ్రికల్చర్ కాలేజీకి 100 ఎకరాలు ఉంటేనే అనుమతి ఇవ్వాలి. దీనిపై రెగ్యులేటరీ కమిటీ నియంత్రణ ఉండాలి. చదువు అనేది కచ్చితంగా ఉపాధి లేక ఉద్యోగం కల్పించాలి. ప్రై%వేటు వర్సిటీల్లో క్వాలిటీ లేనప్పుడు సర్టిఫికెట్లకు ఏం వాల్యూ ఉంటుంది. విద్యా అనేది వ్యాపారం, డబ్బు కోసం కాదు. ఇది ఒక ఛారిటీ. ప్రభుత్వం విద్యా సంస్థల్లో ఖాలీలను భర్తీ చేయాలి. విద్యాశాఖలోని అధికారులు వారధిలా పనిచేయాలిఅని సీఎం వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా విజయవాడలోని ప్రైవేటు కాలేజీల్లో చేపట్టిన తనిఖీల అంశాన్ని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐపీఎల్ అంటూ ఐఐటీ పరీక్షల కోసం ప్రీమియర్ లీగ్‌లు పెడుతున్నారని తెలిపారు. ఫీజుల విషయాన్ని కూడా సీఎం దృష్టికి అధికారులు తెచ్చారు. రూ.40వేల నుంచి లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని వెల్లడించారు.

కాని ప్రభుత్వానికి మాత్రం రూ.2వేలు మాత్రమే వసూలు చేస్తున్నట్టుగా చూపిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇలాంటి కాలేజీలపై కఠినంగా వ్యవరించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com